RNI NO.TELTEL/2023/12249

# హైదరాబాద్ పల్స్

జాతీయ తెలుగు దినపత్రిక

దేశం ముఖ్యం.... దేశ ప్రజల భద్రత ముఖ్యం.... మతం కాదు...

epaper.hyderabadpulsenews.in




సీఈఓ : కె నవీన్ కుమార్ | ఎడిటర్: డా. రాహుల్ కుమార్ | సంపుటి: 03 | సంచిక : 224 | పేజీలు : 08 | సోమవారం | 24-08-2026 | వెల :4/-

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD, SANGAREDDY, WARANGAL, MANCHIRYAL, VIJAYWADA, GUNTUR, KURNOOL, TIRUPATI, KADAPA, BENGALURU, MUMBAI, CHENNAI, DELHI.

# అమెరికా పర్యటన రద్దు..
# అండగా నిలిచిన ఖర్గేకు సీఎం రేవంత్ కృతజ్ఞతలు

హైదరాబాద్ పల్స్,డెస్క్



తన అమెరికా పర్యటనకు కేంద్ర ప్రభుత్వం 'రాజకీయ కారణాలతో' అనుమతి నిరాకరించిందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు. ఈ క్లిష్ట సమయంలో తనకు బలమైన మద్దతుగా నిలిచిన కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు రేవంత్ రెడ్డి సోషల్ మీడియా వేదికగా ఒక ప్రకటన విడుదల చేశారు.లండన్‌లో తాను చేపట్టాల్సిన అధికారిక సమావేశాలు, కార్యక్రమాలు విజయవంతంగా ముగిశాయని రేవంత్ రెడ్డి తెలిపారు. అయితే, కేంద్ర విదేశాంగ శాఖ తన అమెరికా పర్యటనకు అనుమతి నిరాకరించినందున, తొలుత అనుకున్న ప్రకారం బోస్టన్‌కు వెళ్లకుండానే తన పర్యటనను ముగించుకుని హైదరాబాద్‌కు తిరిగి వస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు. "గడిచిన మూడు రోజులుగా లండన్‌లో నాకు లభించిన మద్దతుకు ఎంతో సంతోషంగా ఉంది. ఈ అంశంలో నాకు మద్దతుగా నిలిచిన పార్టీకి, నాయకులకు, దేశవ్యాప్తంగా ఉన్న ప్రజలకు ధన్యవాదాలు. హైదరాబాద్‌కు తిరిగి వచ్చిన తర్వాత సంబంధిత అన్ని విషయాలపై మాట్లాడతాను" అని రేవంత్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు.

**కేంద్రం తీరుపై మల్లికార్జున ఖర్గే తీవ్ర ఆగ్రహం**

అంతకుముందు, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికా పర్యటనకు అనుమతి నిరాకరించడంపై కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కేంద్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రాలకు పెట్టుబడులను ఆకర్షించేందుకు ముఖ్యమంత్రులు చేసే పర్యటనలను ఉద్దేశపూర్వకంగా అడ్డుకోవడం అన్యాయమని ఆయన మండిపడ్డారు. కేంద్రం పక్షపాత వైఖరితో వ్యవహరిస్తోందని ఆరోపించారు."కేంద్రానికి నచ్చిన వారికి అనుమతులు ఇవ్వడం, ఇతరులకు నిరాకరించడం సరైంది కాదు. అమెరికాలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఎన్నారైలు పెద్ద సంఖ్యలో ఉన్నారు. వారిని కలిసి తమ రాష్ట్రాల్లో పరిశ్రమలు పెట్టాలని, పెట్టుబడులు తీసుకురావాలని ముఖ్యమంత్రులు ఆహ్వానిస్తారు. ఈ పర్యటనల ద్వారా వచ్చే పెట్టుబడులు కేవలం రాష్ట్రానికే కాక, దేశానికి కూడా ఎంతో మేలు చేస్తాయి. తద్వారా ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయి. అలాంటి కీలకమైన పర్యటనను అడ్డుకోవడం ద్వారా కేంద్రం దేశ ప్రయోజనాలకు విఘాతం కలిగిస్తోంది" అని ఖర్గే వ్యాఖ్యానించారు.లండన్ నుంచి రేవంత్ రెడ్డి నేరుగా హైదరాబాద్‌కు రానుండటంతో, ఆయన తిరిగి వచ్చాక ఈ వివాదంపై ఏ విధంగా స్పందిస్తారనేది రాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తికరంగా మారింది. ఈ ఘటన కాంగ్రెస్, బీజేపీ మధ్య మరో రాజకీయ ఘర్షణకు దారితీసింది.

# ఏలూరు జిల్లాలో చంద్రబాబు పర్యటన..

## ఉపరాష్ట్రపతితో కలిసి వినూత్న మొక్కజొన్న వంగడం ఆవిష్కరణ



హైదరాబాద్ పల్స్,డెస్క్

ముఖ్యమంత్రి చంద్రబాబు ఆగస్టు 24)ఏలూరు జిల్లాలో పర్యటించనున్నారు. ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్‌తో కలిసి దేశంలోనే మొట్టమొదటి నాన్-జీఎంఓ (జన్యుపరంగా మార్పు చేయని) పాప్‌కార్న్ మొక్కజొన్న హైబ్రిడ్ విత్తనాన్ని ఆయన ఆవిష్కరిస్తారు. ఏలూరు జిల్లా ముసునూరులోని గోర్మే పాప్‌కార్నికా సంస్థ ప్రాంగణంలో ఈ కార్యక్రమం జరగనుంది.వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చాలనే లక్ష్యంతో ఈ ప్రయోగానికి శ్రీకారం చుట్టారు. రైతులు పండించిన పంటకు విలువ జోడించి, ప్రాసెసింగ్, బ్రాండింగ్‌తో మార్కెట్‌కు తరలించడం ద్వారా వారి ఆదాయం పెంచాలన్నది ప్రభుత్వ ఉద్దేశం. ఈ క్రమంలో ముసునూరు వేదికగా జరగనున్న ఈ కార్యక్రమం ప్రాధాన్యత సంతరించుకుంది. గోర్మే పాప్‌కార్నికా సంస్థ ఆధ్వర్యంలో ఈ కొత్త వంగడాన్ని అభివృద్ధి చేశారు.ప్రస్తుతం ఈ సంస్థ దేశవ్యాప్తంగా వేలాది ఎకరాల్లో పాప్‌కార్న్ మొక్కజొన్నను సాగు చేస్తూ, వేలాది మంది రైతులతో భాగస్వామ్యం కలిగి ఉంది. ముసునూరులో ఏర్పాటు చేసిన ఈ ప్లాంట్, ఆసియాలోనే అతిపెద్ద పాప్‌కార్న్ ప్రాసెసింగ్ కేంద్రాలలో ఒకటిగా గుర్తింపు పొందింది. దేశంలోని వేలాది సినిమా థియేటర్లకు పాప్‌కార్న్ సరఫరా చేయడంలో ఈ సంస్థ కీలక పాత్ర పోషిస్తోంది.

**సీఎం పర్యటన వివరాలు**

సీఎం చంద్రబాబు సోమవారం ఉదయం 9:55 గంటలకు తన క్యాంపు కార్యాలయం నుంచి బయలుదేరి, 10:15 గంటలకు ముసునూరు మండలం కాట్రేనిపాడుకు చేరుకుంటారు. ఉదయం 10:45 గంటలకు గవర్నర్ అబ్దుల్ నజీర్‌తో కలిసి ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్‌కు స్వాగతం పలుకుతారు. అనంతరం ఉదయం 11 గంటలకు జరిగే హైబ్రిడ్ మొక్కజొన్న విత్తన ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొంటారు. కార్యక్రమం ముగిశాక, మధ్యాహ్నం 1:20 గంటలకు తిరిగి రాష్ట్ర సచివాలయానికి చేరుకుంటారు.

# అమెరికాతో యుద్ధంలో ఉన్నాం: కెనడా ప్రధాని సంచలనం

హైదరాబాద్ పల్స్,డెస్క్



అగ్రరాజ్యం అమెరికాతో తాము యుద్ధంలో ఉన్నామని కెనడా ప్రధాని మార్క్ కార్నీ సంచలన వ్యాఖ్యలు చేశారు. కెనడా నుంచి దిగుమతి అయ్యే వస్తువులపై 50 శాతం మేర సుంకాలు విధిస్తూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకున్న నిర్ణయంపై ఆయన తీవ్రంగా స్పందించారు. అమెరికా తీసుకున్న ఈ చర్యను తమ దేశంపై జరిగిన ఆర్థిక దాడిగా ఆయన అభివర్ణించారు.ఇటీవల ఇరు దేశాల మధ్య జరిగిన వాణిజ్య చర్చలు చివరి నిమిషంలో విఫలమయ్యాయి. అమెరికా విధించిన షరతులు తమ దేశ సార్వభౌమాధికారాన్ని దెబ్బతీసేలా, కీలక పరిశ్రమలను బలహీనపరిచేలా ఉన్నాయని, అందుకే తాము వాటిని అంగీకరించలేదని మార్క్ కార్నీ స్పష్టం చేశారు. "మీపై దాడి జరిగినప్పుడు, మీరు యుద్ధంలో ఉన్నట్లే భావించాలి. మాపై దాడి జరిగింది. అందుకే మేం కూడా యుద్ధంలోనే ఉన్నాం" అని ఆయన ఘాటుగా వ్యాఖ్యానించారు.ట్రంప్ నిర్ణయానికి ప్రతీకారంగా అమెరికా నుంచి దిగుమతి అయ్యే స్టీల్, గృహోపకరణాలు, వ్యవసాయ పరికరాలు, ఎలక్ట్రానిక్స్ వంటి ఉత్పత్తులపై తాము కూడా సుంకాలు విధించనున్నట్లు ఆయన ప్రకటించారు. సుమారు 20 బిలియన్ డాలర్ల విలువైన కెనడా వస్తువులపై అమెరికా 50 శాతం సుంకాలు విధించింది. ఇది కెనడా వార్షిక ఎగుమతుల్లో దాదాపు 5 శాతానికి సమానం కావడం గమనార్హం.అయితే, అమెరికా తన సుంకాలను తగ్గిస్తే తాము కూడా సానుకూలంగా స్పందిస్తామని మార్క్ కార్నీ తెలిపారు. అమెరికా నుంచే వచ్చే అల్యూమినియం, స్టీల్, మోటార్ వాహనాలపై ఉన్న సుంకాలను తొలగించడానికి సిద్ధంగా ఉన్నామని, అమెరికన్ ఆల్కహాల్ విక్రయాలను తిరిగి ప్రారంభించేలా తమ ప్రావిన్సులను ప్రోత్సహిస్తామని ఆయన పేర్కొన్నారు. ట్రంప్ అసాధ్యమైన షరతులు విధించడం వల్లే తాము ఒప్పందం నుంచి వైదొలగినట్లు మార్క్ కార్నీ వివరించారు.

# వందేమాతరం అంటే హిందూ దేవతల పూజ కాదు: బాబా రాందేవ్




హైదరాబాద్ పల్స్,డెస్క్

'వందేమాతరం' గీతం పూర్తి రూపంలో ఆలపించడంపై వివాదం కొనసాగుతున్న నేపథ్యంలో, యోగా గురు బాబా రాందేవ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆ గీతంలోని సాహిత్యం హిందూ దేవతలైన దుర్గ, లక్ష్మి వంటి వారిని పూజించడం గురించి కాదని, కేవలం 'భారతమాత'కు చేసే ఆరాధన అని ఆయన ఆదివారం స్పష్టం చేశారు.ఉత్తరాఖండ్‌లోని హరిద్వార్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో రాందేవ్ మాట్లాడుతూ.. "మేము భారతమాతనే దుర్గగా, లక్ష్మిగా భావిస్తాం. ఆమే మా విశ్వాసం, మా జ్ఞానం, మా ఆలయం. వందేమాతరంలో దేవతలను, ఆలయాలను చూసేవారు మన సంస్కృతికి దూరమైన వారు. భారతమాత ఆరాధనను దేవతలతో ముడిపెట్టి ఒక మతానికి వ్యతిరేకమని చెప్పడం మేధో దివాళాకోరుతనం" అని అన్నారు.విద్యార్థుల నిరసనల గురించి ప్రస్తావిస్తూ, చిన్న పిల్లలను నిరసనల్లోకి లాగడాన్ని ఆయన తప్పుబట్టారు. "5, 10 ఏళ్ల పిల్లలను కూడా పోలీస్ స్టేషన్లను ముట్టడించాలని, ఎస్పీలు, డీఎంలను ఘెరావ్ చేయాలని ప్రోత్సహిస్తున్నారు. ఇది సరైన పద్ధతి కాదు. అయితే, 18 ఏళ్లు నిండిన వారు ఎక్కడ అన్యాయం జరిగినా తప్పక పోరాడాలి" అని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా కుల దూషణలపైనా రాందేవ్ స్పందించారు. "షెడ్యూల్డ్ కులాలు లేదా తెగల వారిని అవమానించడం రాజ్యాంగ విరుద్ధమైనప్పుడు, బ్రాహ్మణులను దూషించడం కూడా ప్రజాస్వామ్యానికి విరుద్ధమే" అని పేర్కొన్నారు. ఉత్తరాఖండ్‌లో ఉమ్మడి పౌర స్మృతి (యూసీసీ)ని అమలు చేసిన ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామీని ఆయన ప్రశంసించారు.ఇటీవల తన వ్యక్తిగత జీవితంపై వ్యాఖ్యలు చేయవద్దని బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ చేసిన సూచనపై రాందేవ్ స్పందిస్తూ.. "స్వామి రాందేవ్ ఎవరో, ఆయన సేవ ఏంటో ఈ దేశ ప్రజలకు తెలుసు. అందువల్ల, అలాంటి స్థాయి వ్యక్తుల గురించి నేను ఎలాంటి వ్యాఖ్యలు చేయాలనుకోవడం లేదు" అని అన్నారు.

# హర్మ్యాజ్ జలసంధి మాదే... మ్యాప్‌ను పోస్ట్ చేసిన ట్రంప్



అగ్రరాజ్యం అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మరింత తీవ్రమయ్యాయి. ప్రపంచ చమురు రవాణాలో అత్యంత కీలకమైన హర్మ్యాజ్ జలసంధిని 'అమెరికా కొత్త భూభాగం'గా అభివర్ణిస్తూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన చేశారు. ఈ మేరకు హర్మ్యాజ్ జలసంధిని అమెరికా భూభాగంగా చూపిస్తున్న ఒక మ్యాప్‌ను ఆయన తన ట్రూత్ సోషల్ ఖాతాలో ఆదివారం మరోసారి పోస్ట్ చేశారు. ఇరాన్‌పై కఠినమైన ఆంక్షలు విధించేందుకు అమెరికా సిద్ధమవుతున్న తరుణంలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది.గతంలోనూ ట్రంప్ ఇలాంటి వ్యాఖ్యలు చేశారు. సౌత్ కరోలినాలో జరిగిన ఓ ర్యాలీలో మాట్లాడుతూ "నేను హర్మ్యాజ్ జలసంధిని ప్రస్తుతం అమెరికా భూభాగంగానే చూస్తున్నాను" అని స్పష్టం చేశారు. ఇరాన్ నౌకలు, ఓడరేవులపై అమెరికా నావికాదళం దిగ్బంధనం కొనసాగిస్తున్న నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ జలమార్గం గుండా రాకపోకలను అమెరికాయే నియంత్రిస్తోందని, దీనిని అధికారికంగా అమెరికా భూభాగంగా ప్రకటించే ఆలోచనను కూడా ఆయన గతంలో ప్రస్తావించారు. ప్రపంచంలోని ఐదో వంతు సముద్ర చమురు రవాణా ఈ మార్గం గుండానే జరుగుతుంది.

## మనం వాడుతున్న ప్రోబయోటిక్ ట్యాబ్లెట్లపై ఆసక్తికర అధ్యయనం.. అవి మనకు సరిపోవట.. ఎందుకంటే..



మన జీర్ణవ్యవస్థలో ఉండే సూక్ష్మజీవులు ఆహారం, జీవనశైలి, తరతరాల ఆహారపు అలవాట్లకు అనుగుణంగా మారుతూ ఉంటాయి. అందుకే అందరికీ ఒకే రకమైన ప్రోబయోటిక్ ఉత్పత్తులు సమానంగా పనిచేస్తాయా అనే ప్రశ్న ఇప్పుడు ప్రాధాన్యం సంతరించుకుంది. దేశంలోని వివిధ గిరిజన సముదాయాల గట్ మైక్రోబయోమ్‌ను పరిశీలించిన తాజా పరిశోధనలో ఇప్పటివరకు గుర్తించని కొన్ని బ్యాక్టీరియా జాతులతోపాటు వందలాది స్థానిక బ్యాక్టీరియా స్ట్రెయిన్లు బయటపడటం ఈ అంశంపై కొత్త చర్చకు దారితీసింది. దేశంలోని కొన్ని గిరిజన సముదాయాలకు చెందిన ఆరోగ్యవంతుల గట్ మైక్రోబయోమ్‌ను పరిశోధకులు పరిశీలించారు. ఈ సముదాయాల్లో తరతరాలుగా కొనసాగుతున్న ఆహారపు అలవాట్లు ఒకదానికొకటి భిన్నంగా ఉన్నాయి. కొందరు ఎక్కువగా పాల ఉత్పత్తులు, సంపూర్ణ ధాన్యాలు తీసుకుంటుండగా, మరికొందరి ఆహార విధానాలు పూర్తిగా భిన్నంగా ఉన్నాయి. ఈ పరిశీలనలో ఆహారపు అలవాట్లకు, గట్‌లో నివసించే బ్యాక్టీరియా లక్షణాలకు మధ్య ఆసక్తికరమైన సంబంధం కనిపించింది.

ఆహారాల్లో తేడాలే కారణం..

తరతరాలుగా కొనసాగుతున్న ఆహారపు అలవాట్లు గట్‌లోని బ్యాక్టీరియాపై ప్రత్యేకమైన ప్రభావాన్ని చూపుతున్నట్లు పరిశోధన సూచించింది. సాధారణంగా కనిపించే బిఫిడోబ్యాక్టీరియం అడోలెసెంటిస్ వంటి బ్యాక్టీరియాలోనూ పాశ్చాత్య దేశాల ప్రజల గట్ నమూనాల్లో అరుదుగా కనిపించే కార్బోహైడ్రేట్ ప్రాసెసింగ్ జన్యువులను గుర్తించారు. అంటే భారతీయుల సంప్రదాయ ఆహారంలో ఉండే కొన్ని పదార్థాలను జీర్ణం చేసుకోవడానికి ఇక్కడి గట్ బ్యాక్టీరియా కాలక్రమేణా ప్రత్యేకంగా అనుకూలించి ఉండే అవకాశం ఉంటుంది. బార్లీ, గోధుమలు, సంప్రదాయ పాల ఉత్పత్తులు వంటి ఆహార పదార్థాలను జీర్ణం చేసుకోవడంలో సహాయపడే కొన్ని ప్రత్యేక లక్షణాలు స్థానిక బ్యాక్టీరియాలో కనిపించినట్లు పరిశోధన వెల్లడించింది. దీని ద్వారా మనం తీసుకునే ఆహారం కేవలం మన శరీరాన్నే కాకుండా, మన గట్‌లో నివసించే సూక్ష్మజీవుల సముదాయాన్ని కూడా ప్రభావితం చేస్తుందని అర్థమవుతోంది. ఇప్పటివరకు మార్కెట్లో లభించే అనేక ప్రోబయోటిక్ ఉత్పత్తుల్లో యూరప్, ఉత్తర అమెరికా వంటి పాశ్చాత్య ప్రాంతాల ప్రజల్లో గుర్తించిన బ్యాక్టీరియా స్ట్రెయిన్లను ఉపయోగిస్తున్నారు. మంచి బ్యాక్టీరియాగా పరిగణించే ఒక స్ట్రెయిన్ ఎక్కడి వ్యక్తి గట్‌లోకి వెళ్లినా ఒకే విధంగా పనిచేస్తుందనే ఆలోచన దీనికి కారణం. అయితే తాజా పరిశోధన ఈ విధానాన్ని మరోసారి ఆలోచించాల్సిన అవసరాన్ని సూచిస్తోంది.

ప్రోబయోటిక్స్ ఆపేయాలా..

ఒక నిర్దిష్ట ఆహార విధానానికి, గట్ మైక్రోబయోమ్‌కు అనుగుణంగా అభివృద్ధి చెందిన బ్యాక్టీరియా మరో రకమైన ఆహారపు అలవాట్లు ఉన్న వ్యక్తి గట్‌లోకి వెళ్లినప్పుడు అదే స్థాయిలో స్థిరపడవు. అలాగే అక్కడ ఉన్న సూక్ష్మజీవుల సముదాయంతో కలిసి అదే విధంగా పనిచేయవు. అందువల్ల ఒకే రకమైన ప్రోబయోటిక్ అందరికీ సమాన ప్రయోజనం ఇస్తుందనే భావనను పరిశోధన ప్రశ్నిస్తోంది. అయితే దీనర్థం మార్కెట్లో లభించే ప్రోబయోటిక్స్ అన్నింటినీ వెంటనే ఆపేయాలని కాదు. ప్రోబయోటిక్స్ అనే భావనను తిరస్కరించడం కంటే, ఏ బ్యాక్టీరియా స్ట్రెయిన్ ఎవరికి, ఏ ఆహార విధానం ఉన్న వ్యక్తులకు, ఏ గట్ మైక్రోబయోమ్ నేపథ్యంలో ఉపయోగపడుతుందనే అంశంపై మరింత పరిశోధన అవసరమని ఈ పరిశోధన సూచిస్తోంది. భారతీయుల గట్‌కు అనుగుణంగా స్థానిక బ్యాక్టీరియా స్ట్రెయిన్లను గుర్తించి, వాటిపై పరిశోధనలు చేసి, అవసరమైన పరీక్షలు నిర్వహించి ప్రోబయోటిక్ ఉత్పత్తులను అభివృద్ధి చేసే అవకాశం భవిష్యత్తులో పెరుగుతుంది. ముఖ్యంగా భారతీయుల సంప్రదాయ ఆహార విధానాలు, స్థానిక ఆహార పదార్థాలు, గట్‌లో ఇప్పటికే ఉన్న సూక్ష్మజీవుల సముదాయాన్ని పరిగణనలోకి తీసుకుని రూపొందించే విధానాలు మరింత ఉపయోగకరంగా ఉంటాయనే ఆలోచనకు ఈ పరిశోధన బలం చేకూరుస్తోంది.

ఒక్క ట్యాబ్లెట్ కీలకం కాదు..

గట్ ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ఒక్క ప్రోబయోటిక్ సప్లిమెంట్‌పైనే ఆధారపడాల్సిన అవసరం లేదని కూడా ఈ అంశం గుర్తుచేస్తోంది. వైవిధ్యమైన, పీచు పదార్థాలు అధికంగా ఉండే సంప్రదాయ ఆహారాన్ని తీసుకోవడం గట్‌లోని సూక్ష్మజీవుల వైవిధ్యానికి అనుకూలంగా ఉంటుంది. ఒక నిర్దిష్ట ప్రోబయోటిక్‌ను కేవలం ప్రకటనలు లేదా మార్కెటింగ్ ఆధారంగా ఎంచుకోవడం కంటే, అవసరం ఉంటే వైద్య నిపుణుల సలహాతో తీసుకోవడం మంచిది. దేశంలోని గిరిజన సముదాయాల గట్ మైక్రోబయోమ్‌పై జరిగిన ఈ పరిశోధన దేశంలో ఇప్పటివరకు పెద్దగా గుర్తించని సూక్ష్మజీవుల వైవిధ్యాన్ని వెలుగులోకి తీసుకువచ్చింది. భవిష్యత్తులో మరిన్ని స్థానిక బ్యాక్టీరియా స్ట్రెయిన్లపై పరిశోధనలు జరిగితే భారతీయుల ఆహార విధానం, గట్ మైక్రోబయోమ్‌కు అనుగుణంగా ప్రత్యేకంగా రూపొందించిన ప్రోబయోటిక్స్ అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంటుంది. అంటే విదేశాల్లో అభివృద్ధి చేసిన ఒకే రకమైన ప్రోబయోటిక్ అందరికీ సరిపోతుందా అనే ప్రశ్నకు బదులుగా, వ్యక్తి ఆహారం, గట్ మైక్రోబయోమ్‌కు అనుగుణంగా సరైన బ్యాక్టీరియాను ఎంచుకోవడంపై భవిష్యత్తు పరిశోధనలు దృష్టి పెట్టే అవకాశం ఉంటుంది.

## బీమా పాలసీ తీసుకుంటున్నారా? ఈ 5 ముఖ్యమైన అంశాలు గమనించండి!

స్పోర్ట్స్ డెస్క్: ప్రస్తుతం కాలంలో ఆరోగ్యాన్ని కాపాడుకోవడమే మహాకష్టంగా మారింది. చాలా మంది ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నాఅనారోగ్యాల బారినపడుతున్నాము. అలానే అకస్మాత్తుగా జరిగే వివిధ రకాల ప్రమాదాలతో అనేక మంది జీవితాలు చీకటిమయంగా మారుతున్నాయి. ఇంకా చెప్పాలంటే.. అనుకోని విపత్తులు వచ్చిన ఒళ్లు ఇల్లు గుల్లవుతాయి. వచ్చే ప్రమాదాలను, సమస్యలను మనం తప్పించుకోలేకపోయినా.. వాటి నుంచి కాస్త అయిన ఉపశమనం పొందేందుకు బీమా పాలసీ తప్పనిసరిగా తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. కేవలం తక్కువ ప్రీమియం చూసి మోసపోకుండా, సరైన పాలసీని ఎంచుకోవడానికి నిపుణులు కొన్ని కీలక సూచనలు చేశారు. అవేమిటో ఇక్కడ పరిశీలిద్దాం.




**1. ప్రీమియం ఒక్కటే చూడకండి – కవరేజ్ ముఖ్యం:**
అత్యంత చౌకైన పాలసీ ఎప్పుడూ ఉత్తమమైనది కాకపోవచ్చు. ముందుగా మీ కుటుంబ అవసరాలకు తగినంత కవరేజ్ లభిస్తుందా లేదా అని బేరీజు వేసుకోవాలి. టర్మ్ ఇన్సూరెన్స్ తీసుకునేటప్పుడు మీ ఆదాయం, అప్పులు, ఇతర ఖర్చులను బట్టి సరైన ప్రీమియంను ఎంచుకోవాలి. అలాగే హెల్త్ ఇన్సూరెన్స్‌లో మనం తీసుకునే ప్రీమియం అయితే పెద్ద ఆసుపత్రిలో కూడా చికిత్స చేసుకునే సదుపాయం ఇస్తుందా అని ప్రశ్నించుకోవాలి.

**2. మినహాయింపులు, వెయిటింగ్ పీరియడ్ గమనించాలి:**
చాలా మంది పాలసీ ఏం కవర్ చేస్తుందో చూస్తారు కానీ, ఏది కవర్ చేయదనే అంశాన్ని (జుఇఎశ్రీబంఱశీఅం) పరిశీలించరు. ఆరోగ్య బీమాలో ముందే ఉన్న రోగాల వెయిటింగ్ పీరియడ్, గది అద్దె పరిమితులు వంటి నిబంధనలు మనం ఇన్సూరెన్స్ క్లెయిమ్ చేసుకునే సమయంలో నేరుగా ప్రభావం చూపుతాయి. కాబట్టి పాలసీ తీసుకునే ముందే ఈ నిబంధనలను క్షుణ్ణంగా అర్థం చేసుకోవాలి.

**3. ఆకర్షణీయమైన ఫీచర్ల కంటే సర్వీస్ ముఖ్యం:**
కేవలం ఆకర్షణీయమైన ప్రకటనలు లేదా తక్కువ ప్రీమియం చూసి నిర్ణయం తీసుకోకండి. పాలసీ పునరుద్ధరణ నిబంధనలు, బీమ సంస్థ సెటిల్మెంట్ రికార్డు ఎలా ఉందో చూసుకోవాలి. క్లెయిమ్స్ లేదా సర్వీస్‌కు సంబంధించి ఫిర్యాదులు పెరుగుతున్న నేపథ్యంలో నమ్మకమైన సంస్థను ఎంచుకోవడం ఉత్తమం.

**4. బీమాను, పెట్టుబడిని కలపకండి:**
బీమా అనేది కేవలం ఆర్థిక రక్షణ కోసం మాత్రమే. పెట్టుబడులు సంపదను సృష్టిస్తాయి. కాబట్టి మీ కుటుంబానికి రక్షణ కావాలంటే తగిన టర్మ్ లేదా హెల్త్ పాలసీ తీసుకోవాలి. రిటైర్మెంట్ లేదా ఇతర ఆర్థిక లక్ష్యాల కోసం అయితే మ్యూచువల్ ఫండ్స్, సిప్ (రాఖా) వంటి ఇతర పెట్టుబడి మార్గాలను ఎంచుకోవాలి.

**5. పాలసీ తీసుకుని మర్చిపోవద్దు:**
సమయంతో పాటు మన బాధ్యతలు మారుతుంటాయి. పెళ్లి, పిల్లలు, గృహ రుణాలు, లేదా వృద్ధులైన తల్లిదండ్రుల బాధ్యతలు పెరిగినప్పుడు మన బీమా అవసరాలు కూడా మారుతాయి. కాబట్టి మీ ఆర్థిక పరిస్థితులు మారిన ప్రతిసారీ మీ ఇన్సూరెన్స్ కవరేజ్‌ను సమీక్షించుకోవడం చాలా ముఖ్యమని ఇన్సూరెన్స్ నిపుణులు సూచిస్తున్నారు.

## దీర్ఘకాలంగా ఒత్తిడి ఉంటే కొలెస్ట్రాల్‌పై ప్రభావం పడే ప్రమాదం.. హెచ్చరిస్తున్న నిపుణులు..

ఆధునిక జీవనశైలిలో ఒత్తిడి, అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లు సాధారణంగా మారుతున్నాయి. అయితే వీటి ప్రభావం కేవలం మానసిక ఆరోగ్యంపైనే కాకుండా గుండె ఆరోగ్యంపైనా పడుతోంది. ముఖ్యంగా దీర్ఘకాలిక ఒత్తిడి, అధిక కొవ్వులు, చక్కెరలు ఉన్న ఆహారం తీసుకోవడం వంటి కారణాలు కొలెస్ట్రాల్ స్థాయిలను ప్రభావితం చేసే అవకాశం ఉంటుంది. కొలెస్ట్రాల్ పెరగడం వల్ల గుండె జబ్బులు, రక్తనాళాల్లో అడ్డంకులు ఏర్పడే ప్రమాదం పెరుగుతుంది. అందుకే ఒత్తిడిని నియంత్రించడంతోపాటు ఆహారపు అలవాట్లపైనా దృష్టి పెట్టడం అవసరం. ఒత్తిడి కొలెస్ట్రాల్‌ను నేరుగా ప్రభావితం చేస్తుందని వైద్యులు చెబుతున్నారు. మనం ఒత్తిడికి గురైనప్పుడు శరీరంలో కార్టిసాల్, అడ్రినలిన్ వంటి హార్మోన్లు ఎక్కువగా విడుదలవుతాయి. ఇవి అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు శరీరాన్ని సిద్ధం చేసే ఫైట్ ఆర్ ఫ్లైట్ ప్రతిస్పందనలో భాగంగా పనిచేస్తాయి. అయితే ఒత్తిడి దీర్ఘకాలం కొనసాగితే ఈ హార్మోన్ల ప్రభావం శరీరంలోని జీవక్రియలపై పడుతుంది.

రక్తనాళాల్లో పేరుకుపోయే కొవ్వు..

దీర్ఘకాలిక ఒత్తిడి సమయంలో కార్టిసాల్ స్థాయిలు పెరగడం వల్ల కాలేయం మరింత గ్లూకోజ్‌ను తయారు చేయడంతోపాటు కొలెస్ట్రాల్, ట్రైగ్లిజరైడ్ల ఉత్పత్తిని కూడా పెంచుతుంది. ఇవి శరీరానికి కొన్ని ముఖ్యమైన ప్రక్రియల్లో అవసరమైనప్పటికీ, ఎక్కువ కాలం స్థాయిలు అధికంగా ఉంటే రక్తనాళాల్లో కొవ్వు పేరుకుపోయి అడ్డంకులు ఏర్పడే ప్రమాదం పెరుగుతుంది. దీర్ఘకాలిక మానసిక ఒత్తిడి శరీరంలో స్వల్పస్థాయి వాపును కూడా పెంచే అవకాశం ఉంటుంది. నిరంతరం ఒత్తిడికి గురైనప్పుడు హార్మోన్లు, నాడీ వ్యవస్థకు సంబంధించిన కొన్ని మార్పులు ఇన్ఫ్లమేటరీ మార్కర్లను ప్రభావితం చేస్తాయి. ఇవి గుండె జబ్బులు, మధుమేహం వంటి దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలతో సంబంధం కలిగి ఉంటాయని పరిశోధనలు సూచిస్తున్నాయి. ఒత్తిడి వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు పెరగడంతోపాటు శరీరంలో నిల్వ ఉన్న కొవ్వులు రక్తప్రవాహంలోకి విడుదల కావడం కూడా పెరుగుతుంది. దీనివల్ల ట్రైగ్లిజరైడ్లు, మొత్తం కొలెస్ట్రాల్ స్థాయిలు ప్రభావితమయ్యే అవకాశం ఉంటుంది. అందువల్ల దీర్ఘకాలిక ఒత్తిడిని కేవలం మానసిక సమస్యగా కాకుండా శారీరక ఆరోగ్యాన్ని కూడా ప్రభావితం చేసే అంశంగా చూడాల్సిన అవసరం



ఉంది.

ఆహారపు అలవాట్లపైనా ఎఫెక్ట్..

ఒత్తిడి నేరుగా కొలెస్ట్రాల్‌పై ప్రభావం చూపడమే కాకుండా మన ఆహారపు అలవాట్లను కూడా మారుస్తుంది. ఒత్తిడిలో ఉన్నప్పుడు ఆకలి, కడుపు నిండిన భావనను నియంత్రించే హార్మోన్లలో మార్పులు చోటుచేసుకుంటాయి. ఫలితంగా కొందరిలో భావోద్వేగాలకు అనుగుణంగా ఎక్కువగా తినే అలవాటు ఏర్పడుతుంది. ఒత్తిడి ఎక్కువగా ఉన్నప్పుడు తీపి, కొవ్వు అధికంగా ఉన్న ఆహారాలపై కోరిక పెరగడం సాధారణం. తక్షణంగా ఆకలి లేదా ఒత్తిడిని తగ్గించుకోవడానికి ప్యాకేజ్డ్ స్నాక్స్, ఫాస్ట్ ఫుడ్, ఇతర అల్ట్రా-ప్రాసెస్డ్ ఆహారాలను ఎక్కువగా తీసుకునే అవకాశం ఉంటుంది. ఈ ఆహారపు అలవాట్లు కొనసాగితే కొలెస్ట్రాల్ స్థాయిలపై ప్రతికూల ప్రభావం పడుతుంది. ఒత్తిడిని ఎదుర్కొనే క్రమంలో కొందరిలో మద్యం తీసుకోవడం కూడా పెరుగుతుంది. అధిక మద్యం వినియోగం ట్రైగ్లిజరైడ్ల స్థాయిలను పెంచడంతోపాటు గుండె ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తుంది. అదే విధంగా భోజన సమయాలు కూడా మారిపోతాయి. రాత్రివేళ ఆలస్యంగా ఎక్కువగా తినడం వల్ల అధిక కేలరీలు, సంతృప్త కొవ్వులు, ట్రాన్స్ ఫ్యాట్లు శరీరంలోకి చేరే అవకాశం ఉంటుంది.

ఒత్తిడి, ఆహారం రెండింటి పాత్ర..

కొలెస్ట్రాల్ పెరగడంలో ఒత్తిడి, ఆహారం రెండింటికీ పాత్ర ఉంటుంది. కేవలం ఒత్తిడిని తగ్గించడం లేదా కేవలం ఆహారాన్ని మార్చడం మాత్రమే సరిపోదు. గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటే ఒత్తిడి నియంత్రణతోపాటు సమతుల్యమైన ఆహారం, శారీరక చురుకుదనం వంటి అంశాలపై కూడా దృష్టి పెట్టాలి. ఒత్తిడి కొలెస్ట్రాల్ స్థాయిలను ప్రభావితం చేస్తుందని సూచించే కొన్ని సంకేతాల్లో తరచూ ఆందోళనగా అనిపించడం, రక్తపోటు, ఒత్తిడిలో ఎక్కువగా తినడం, నడుము చుట్టూ కొవ్వు పెరగడం, నిద్ర సరిగా లేకపోవడం, అలసట, సాధారణ ఆరోగ్య పరీక్షల్లో కొలెస్ట్రాల్ స్థాయిలు పెరగడం వంటివి ఉంటాయి. అయితే ఈ లక్షణాలు ఇతర కారణాల వల్ల కూడా వస్తాయని గుర్తుంచుకోవాలి. ఒత్తిడితోపాటు కొలెస్ట్రాల్‌ను నియంత్రించుకోవాలంటే క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం ఉపయోగకరంగా ఉంటుంది. గుండెకు మేలు చేసే ఆహారాన్ని తీసుకోవడం, నిద్ర నాణ్యతను మెరుగుపరచడం, ధ్యానం లేదా మైండ్‌ఫుల్‌నెస్ వంటి పద్ధతులను పాటించడం ద్వారా ఒత్తిడిని తగ్గించుకోవచ్చు. మద్యం, ధూమపానానికి దూరంగా ఉండడమే కూడా గుండె ఆరోగ్యానికి మేలు చేస్తుంది. కొలెస్ట్రాల్ స్థాయిలను ఎప్పటికప్పుడు పరీక్షించుకోవడం ద్వారా అవసరమైన మార్పులు చేసుకోవచ్చు.

ఏం చేయాలి..

కొలెస్ట్రాల్‌ను ఆరోగ్యకరమైన స్థాయిలో ఉంచేందుకు ఓట్స్, బార్లీ, బీన్స్, పప్పులు, గింజలు, కొవ్వు అధికంగా ఉండే చేపలు, కరిగే పీచు పదార్థం ఎక్కువగా ఉన్న పండ్లు, విత్తనాలు, కూరగాయలు, ఆలివ్ ఆయిల్ వంటి ఆహారాలను ఆహారంలో భాగం చేసుకోవచ్చు. ముఖ్యంగా పీచు పదార్థాలు అధికంగా ఉండే ఆహారం గుండె ఆరోగ్యానికి అనుకూలంగా ఉంటుంది. కొలెస్ట్రాల్ పరీక్షల్లో చెడు కొలెస్ట్రాల్ లేదా మొత్తం కొలెస్ట్రాల్ స్థాయిలు పదేపదే అధికంగా వస్తుంటే వైద్యులని సంప్రదించడం అవసరం. కుటుంబంలో గుండె జబ్బుల చరిత్ర ఉన్నవారు, రక్తపోటు ఉన్నవారు, మధుమేహం లేదా ప్రీడయాబెటిస్ ఉన్నవారు మరింత జాగ్రత్తగా ఉండాలి. అలాగే దీర్ఘకాలిక ఒత్తిడి రోజువారీ జీవితాన్ని ప్రభావితం చేస్తుంటే దాన్ని నియంత్రించేందుకు నిపుణుల సలహా తీసుకోవడం మంచిది. ఒత్తిడి, ఆహారపు అలవాట్లు రెండూ కొలెస్ట్రాల్ స్థాయిలను ప్రభావితం చేసే మార్గాలు ఉన్నాయి. దీర్ఘకాలిక ఒత్తిడిని నిర్లక్ష్యం చేయకుండా, ఆరోగ్యకరమైన ఆహారం తీసుకుంటూ, క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తూ, తగినంత నిద్రకు ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా గుండె ఆరోగ్యాన్ని మెరుగ్గా కాపాడుకోవచ్చు. కొలెస్ట్రాల్ స్థాయిలు పెరిగినట్లు పరీక్షల్లో తేలితే కారణాన్ని గుర్తించి సరైన వైద్య సలహా తీసుకోవడం మంచిది.

## విటమిన్ బి12 లోపంతో ఆందోళన పెరుగుతుందా ? నిపుణులు ఏం చెబుతున్నారంటే.."

ఆందోళన, చిరాకు, అలసట వంటి సమస్యలకు ఒత్తిడి లేదా మానసిక ఆరోగ్య పరిస్థితులే కారణమని చాలామంది భావిస్తారు. అయితే శరీరంలో కొన్ని ముఖ్యమైన పోషకాలు లోపించినా ఇలాంటి లక్షణాలు కనిపించే అవకాశం ఉంగుంది. ముఖ్యంగా విటమిన్ బి12 లోపం మెదడు పనితీరు, నాడీ వ్యవస్థ, మానసిక స్థితిపై ప్రభావం చూపిస్తుందని నిపుణులు చెబుతున్నారు. కొన్ని సందర్భాల్లో బి12 స్థాయిలు తగ్గడం వల్ల ఆందోళనను పోలిన లక్షణాలు కూడా కనిపిస్తాయి. అయితే ప్రతి వ్యక్తిలో దీని ప్రభావం ఒకేలా ఉండదు. విటమిన్ బి12 నాడులు సక్రమంగా పనిచేయడానికి, మెదడు మధ్య సమాచార మార్పిడికి అవసరమైన న్యూరోట్రాన్స్‌మిటర్ల తయారీలో కీలక పాత్ర పోషిస్తుంది. అందువల్ల శరీరంలో బి12 తగినంతగా లేకపోతే ఆందోళన, చిరాకు, భయాందోళన, మానసిక స్థితిలో మార్పులు, తక్కువ ఉత్సాహం వంటి లక్షణాలు కనిపించే అవకాశం ఉంటుంది. విటమిన్ బి12ని కోబాలమిన్ అని కూడా పిలుస్తారు. ఇది నీటిలో కరిగే విటమిన్. మెదడు పనితీరు, నాడుల ఆరోగ్యం, ఎర్ర రక్త కణాల తయారీ, డీఎన్ఏ నిర్మాణం వంటి అనేక ముఖ్యమైన ప్రక్రియలకు ఇది అవసరం. శరీరం తగినంత బి12ను స్వయంగా తయారు చేసుకోలేకపోవడంతో ఆహారం ద్వారా పొందాలి. చేపలు, గుడ్లు, పాలు, పాల ఉత్పత్తులు, చికెన్, మాంసం వంటి వాటిలో విటమిన్ బి12 లభిస్తుంది.

నాడీ వ్యవస్థ ఆరోగ్యానికి..

నాడీ వ్యవస్థ ఆరోగ్యంగా ఉండటంలో విటమిన్ బి12కి ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. నరాలపై ఉండే మైలిన్ అనే రక్షణ పొరను నిర్వహించడంలో ఇది సహాయపడుతుంది. ఈ రక్షణ పొర సరిగ్గా ఉంటే మెదడు, వెన్నుపాము, శరీరంలోని ఇతర భాగాల మధ్య విద్యుత్ సంకేతాలు సక్రమంగా ప్రసారం అవుతాయి. బి12 లోపం ఏర్పడినప్పుడు నాడీ వ్యవస్థ పనితీరు దెబ్బతినే అవకాశం ఉంటుంది. ఎర్ర రక్త కణాల తయారీలోనూ బి12 కీలక పాత్ర పోషిస్తుంది. ఈ విటమిన్ లోపిస్తే ఎర్ర రక్త కణాల ఉత్పత్తి ప్రభావితమై మెగాలోబ్లాస్టిక్ అనీమియా వంటి సమస్యలు ఏర్పడతాయి. దాంతో శరీరానికి ఆక్సిజన్ సరఫరా సరిగా జరగక అలసట, బలహీనత, తల తిరగడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. మెదడు ఆరోగ్యానికి కూడా బి12 అవసరం. ఈ విటమిన్ స్థాయిలు చాలా తక్కువగా ఉన్నప్పుడు జ్ఞాపకశక్తి తగ్గడం, ఆలోచనా సామర్థ్యంలో మార్పులు, మెదడు మబ్బుగా అనిపించడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. తీవ్రమైన లోపం ఉన్నప్పుడు మరింత తీవ్రమైన నాడీ సంబంధిత సమస్యలు కూడా ఏర్పడే అవకాశం ఉంటుంది.

ఆందోళన పెరుగుతుందా..

విటమిన్ బి12 లోపం ఆందోళన లక్షణాలను పెంచడానికి ఒక కారణం అవుతుందని చెబుతున్నారు. శరీరంలో బి12 తక్కువగా ఉన్నప్పుడు మెదడు పనితీరుకు అవసరమైన కొన్ని రసాయన ప్రక్రియలు ప్రభావితమవుతాయి. ముఖ్యంగా హోమోసిస్టీన్ అనే పదార్థాన్ని మెథియోనిన్‌గా మార్చే ప్రక్రియలో బి12 అవసరం. ఈ ప్రక్రియ మెదడు పనితీరు, మానసిక స్థితి నియంత్రణకు సంబంధించిన జీవరసాయన చర్యల్లో భాగం. బి12 లోపం వల్ల అలసట, బలహీనత, మెదడు మబ్బుగా అనిపించడం వంటి సమస్యలు కూడా వస్తాయి. ఇవి రోజువారీ పనితీరుపై ప్రభావం చూపడంతో కొందరిలో ఆందోళన మరింత ఎక్కువగా అనిపించే అవకాశం ఉంటుంది. అలాగే నాడీ వ్యవస్థ పనితీరు దెబ్బతినడం వల్ల చేతులు, కాళ్లలో తిమ్మిర్లు, గుండె వేగంగా కొట్టుకోవడం, తల తిరగడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఇవి కొన్నిసార్లు పానిక్ అటాక్ లక్షణాలను పోలి ఉంటాయి.

ఎలాంటి లక్షణాలు కనిపిస్తాయి..

విటమిన్ బి12 లోపం ఉన్నప్పుడు శారీరక లక్షణాలతోపాటు నాడీ సంబంధిత లక్షణాలు కూడా కనిపిస్తాయి. తీవ్రమైన అలసట, బలహీనత, చర్మం పాలిపోయినట్లు కనిపించడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, తల తిరగడం వంటి సమస్యలు వస్తాయి. చేతులు, కాళ్లలో తిమ్మిర్లు, సమతుల్యత కోల్పోవడం, జ్ఞాపకశక్తి సమస్యలు, మెదడు మబ్బుగా అనిపించడం వంటి నాడీ సంబంధిత లక్షణాలు కూడా కనిపించే అవకాశం ఉంటుంది. మానసిక ఆరోగ్యానికి సంబంధించి ఆందోళన, చిరాకు, డిప్రెషన్, మూడ్‌లో మార్పులు, ఏకాగ్రత లోపించడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. అయితే ఇలాంటి లక్షణాలు కనిపించిన ప్రతిసారీ బి12 లోపమే కారణమని భావించకూడదు. ఆందోళనకు అనేక ఇతర కారణాలు కూడా ఉంటాయి. కొంతమందిలో విటమిన్ బి12 లోపం వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. ముఖ్యంగా పూర్తిగా శాకాహార లేదా వేగన్ ఆహారం తీసుకునేవారిలో బి12 లోపం ఏర్పడే అవకాశం ఉంటుంది. సహజంగా బి12 లభించే మొక్కల ఆధారిత ఆహార పదార్థాలు చాలా తక్కువగా ఉండటం ఇందుకు ఒక కారణం. వయసు పెరిగే కొద్దీ బి12 శోషణ తగ్గే అవకాశం ఉన్నందున వృద్ధుల్లోనూ లోపం కనిపిస్తుంది.

జీర్ణ వ్యవస్థ సమస్యలు ఉంటే..

జీర్ణవ్యవస్థకు సంబంధించిన సమస్యలు ఉన్నవారిలోనూ ఆహారం నుంచి బి12 శరీరంలోకి శోషించుకోవడం తగ్గుతుంది. అలాగే మెట్‌ఫార్మిన్, ప్రోటాన్ పంప్ ఇన్హిబిటర్స్ వంటి కొన్ని మందులను దీర్ఘకాలం ఉపయోగించే వారు కూడా బి12 స్థాయిలపై వైద్యుల సలహా తీసుకోవాల్సి ఉంటుంది. బి12 లోపం ఉన్నవారికి లోపాన్ని సరిచేయడం వల్ల ప్రయోజనం ఉంటుంది. అయితే బి12 స్థాయిలు సాధారణంగా ఉన్న ప్రతి ఒక్కరూ అదనంగా బి12 సప్లిమెంట్లు తీసుకోవాల్సిన అవసరం లేదు. సాధారణ బి12 స్థాయిలు ఉన్నవారిలో కేవలం సప్లిమెంట్లు తీసుకోవడం ద్వారా ఆందోళన గణనీయంగా తగ్గుతుంది. ఎప్పటికప్పుడు లేదా నిరంతరం ఆందోళనగా అనిపించడం, కారణం తెలియని తీవ్రమైన అలసట, చేతులు లేదా కాళ్లలో తిమ్మిర్లు, జ్ఞాపకశక్తి సమస్యలు, సమతుల్యతలో ఇబ్బందులు వంటి లక్షణాలు ఉంటే విటమిన్ బి12 స్థాయిలను పరీక్షించుకోవడం గురించి వైద్యుడిని సంప్రదించవచ్చు. ముఖ్యంగా దీర్ఘకాలంగా శాకాహార లేదా వేగన్ ఆహారం తీసుకునేవారు బి12 స్థాయిలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి.



# చిన్నారి ప్రాణం కోసం తల్లిదండ్రుల తపన

**అరుదైన బోన్‌మ్యారో జన్యు వ్యాధితో కశ్విక పోరాటం**

**ఆస్తి అమ్మి వైద్యం.. ఇక సమాజం అండే ఆధారం**

**హైదరాబాద్ పల్స్, ఆగస్టు 23, ఖమ్మం జిల్లా ప్రతినిధి:**
ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం పిండిప్రోలు గ్రామానికి చెందిన కాంపాటి రవీందర్–సుజన దంపతుల ఏకైక కుమార్తె కశ్విక అరుదైన బోన్‌మ్యారో జన్యు వ్యాధితో బాధపడుతోంది. చిన్నారి ప్రాణాలను కాపాడేందుకు అత్యవసర వైద్య చికిత్సతో పాటు బోన్‌మ్యారో జన్యు మార్పిడి అవసరమని వైద్యులు సూచించినట్లు తల్లిదండ్రులు తెలిపారు. కశ్వికకు వ్యాధి నిర్ధారణ అయినప్పటి నుంచి తల్లిదండ్రులు ఆసుపత్రుల చుట్టూ తిరుగుతూ చికిత్స అందిస్తున్నారు. కుమార్తెను ఎలాగైనా కాపాడుకోవాలనే ఆశతో తండ్రి రవీందర్ తనకున్న ఆస్తిని విక్రయించి



ఇప్పటివరకు సుమారు రూ.15 లక్షలు వైద్య ఖర్చులకు వెచ్చించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రస్తుతం తదుపరి చికిత్సకు రూ.50 లక్షలకు పైగా అవసరమవుతుందని వైద్యులు తెలిపినట్లు తల్లిదండ్రులు పేర్కొన్నారు. ఇప్పటికే ఉన్న ఆస్తిని విక్రయించి భారీగా ఖర్చు చేసిన నేపథ్యంలో ఈ మొత్తాన్ని సమకూర్చడం కుటుంబానికి కష్టంగా మారింది. దీంతో దాతలు, మానవతావాదులు, స్వచ్ఛంద సంస్థలు స్పందించి చిన్నారి చికిత్సకు ఆర్థిక సహాయం అందించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.






**దాతల చేయూత కోసం ఎదురుచూపు**

"మా బిడ్డను కాపాడుకోవడానికి మా దగ్గర ఉన్నదంతా ఖర్చు చేశాం. ఇప్పుడు మీ సహాయం కోసం చేతులు జోడించి అడుగుతున్నాం. మీకు చేతనైనంత సాయం చేయండి. మీ చిన్న సహాయం కూడా మా పాపకు ప్రాణాధారంగా మారుతుంది" అని రవీందర్–సుజన దంపతులు విజ్ఞప్తి చేస్తున్నారు. చిన్నారి వైద్యానికి సహాయం చేయాలనుకునే దాతలు కుటుంబ సభ్యులు అందిస్తున్న ఫోన్‌పే నంబర్ ద్వారా తమకు సాధ్యమైనంత ఆర్థిక సహాయం అందించాలని కోరారు. సమాజంలోని దాతలు, స్వచ్ఛంద సంస్థలు, సేవాభావం కలిగిన వ్యక్తులు స్పందించి కశ్విక చికిత్సకు అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు.

**సహాయం కోసం ఫోన్‌పే నంబర్:**
**7989768368**

చిన్నారి కశ్వికకు అవసరమైన వైద్యం అందించి ఆరోగ్యంగా ఇంటికి చేరేలా ప్రతి ఒక్కరూ తమకు సాధ్యమైన సహాయం చేయాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

# చిన్నారి కశ్వికకు నెహ్రూ నాయక్ ఆపన్నహస్తం

**పాప ఆరోగ్య పరిస్థితి విని చలించి.. వైద్య ఖర్చులకు రూ.50 వేల సాయం**

**హైదరాబాద్ పల్స్, ఆగస్టు 23, మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి:**
చిన్నారి కశ్విక వైద్య చికిత్సకు ఆర్థిక సహాయం అందించి మహబూబాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు మాలోత్ నెహ్రూ నాయక్ మానవత్వాన్ని చాటుకున్నారు. ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం పిండిప్రోలు గ్రామానికి చెందిన కాంపాటి రవీందర్––సుజన దంపతుల కుమార్తె కశ్విక బోన్‌మ్యారోకు సంబంధించిన జన్యుపరమైన తీవ్రమైన వ్యాధితో బాధపడుతోంది. చిన్నారి వైద్యానికి సుమారు రూ.50 లక్షల వరకు ఖర్చు అవుతున్నట్లు తండ్రి రవీందర్ తెలిపారు. కశ్విక ఆరోగ్య పరిస్థితి, ఇప్పటివరకు చేసిన వైద్య ఖర్చులు, కుటుంబం ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులను రవీందర్ నెహ్రూ నాయక్‌కు వివరించారు. చిన్నారి పరిస్థితిని విన్న నెహ్రూ నాయక్ స్పందించి, వైద్య ఖర్చుల కోసం తనవంతు సాయంగా రూ.50 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. కశ్విక త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించిన నెహ్రూ నాయక్.. కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. చిన్నారి వైద్యానికి భారీగా ఖర్చు అవుతున్న నేపథ్యంలో మానవతావాదులు, దాతలు ముందుకు వచ్చి తమవంతు ఆర్థిక సహాయం అందించాలని కోరారు. ఆపదలో ఉన్న చిన్నారి పరిస్థితిని తెలుసుకుని వెంటనే స్పందించి సహాయం అందించిన నెహ్రూ నాయక్‌ను పలువురు అభినందించారు. మరింత మంది దాతలు ముందుకు వచ్చి కశ్విక



చికిత్సకు సహకరించాలని కుటుంబ సభ్యులు విజ్ఞప్తి చేస్తున్నారు.

**సహాయం కోసం ఫోన్‌పే నంబర్: 7989768368**

ఈ కార్యక్రమంలో అనంతుల ఉపేందర్ గౌడ్, మంద ప్రకాష్, సక్రం, సతీష్, జానీ, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# సిపిఎస్ రద్దు.. పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలి

**ఉద్యోగులు, ఉపాధ్యాయుల భవిష్యత్ భద్రతకు పాత పెన్షన్ విధానమే భరోసా.**

**ఎన్నికల హామీని అమలు చేయాలని ప్రభుత్వానికి డిమాండ్.**

**హైదరాబాద్ మహాసభకు మరిపెడ నుంచి భారీగా తరలివెళ్లిన ఉద్యోగ, ఉపాధ్యాయులు.**

**హైదరాబాద్ పల్స్, ఆగస్టు 23, మరిపెడ:**
కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి ఉద్యోగులు, ఉపాధ్యాయులకు భవిష్యత్ ఆర్థిక భద్రత కల్పించే పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలు ఉద్యమాన్ని ఉధృతం చేస్తున్నాయి. ఇందులో భాగంగా హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో ఆదివారం నిర్వహించిన సీపీఎస్ రద్దు–ఓపీఎస్ అమలు మహాసభకు మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం నుంచి టీఎస్‌సీపీఎస్ఈయూ ఆధ్వర్యంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. ఈ సందర్భంగా సంఘం మండల శాఖ నాయకులు మాట్లాడుతూ.. ఉద్యోగ విరమణ అనంతరం గౌరవప్రదమైన జీవనం సాగించేందుకు పాత పెన్షన్ విధానం ఎంతో కీలకమని పేర్కొన్నారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానంలో పదవీ విరమణ అనంతరం వచ్చే ఆదాయంపై స్పష్టమైన భరోసా




లేకపోవడంతో ఉద్యోగుల్లో ఆందోళన నెలకొంటోందన్నారు. ప్రభుత్వ సేవలో జీవితకాలం పనిచేసిన ఉద్యోగులకు పదవీ విరమణ అనంతరం ఆర్థిక భద్రత కల్పించడం ప్రభుత్వ బాధ్యతగా భావించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని నాయకులు డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి అనుముల రేవంత్‌రెడ్డి హామీని అమలు చేసి రాష్ట్రంలోని ఉద్యోగులు, ఉపాధ్యాయుల భవిష్యత్‌కు భరోసా కల్పించాలని కోరారు. మరిపెడ నుంచి హైదరాబాద్‌కు తరలివెళ్లిన ఉద్యోగులు, ఉపాధ్యాయులు తమ డిమాండ్లపై ఐక్యంగా నినదించారు. "సీపీఎస్ రద్దు––పాత పెన్షన్ విధానం అమలు", "ఉద్యోగుల భవిష్యత్ భద్రతకు పాత పెన్షన్ విధానమే ఆధారం" అంటూ నినాదాలు చేశారు. పాత పెన్షన్ విధానం అమలయ్యే వరకు ఉద్యోగులు, ఉపాధ్యాయులను ఐక్యం చేసి ప్రజాస్వామ్య పద్ధతిలో ఉద్యమాన్ని మరింత బలోపేతం చేస్తామని టీఎస్‌సీపీఎస్ఈయూ మరిపెడ మండల శాఖ నాయకులు స్పష్టం చేశారు.

# సాంకేతిక పరికరాల కోసం వేధించొద్దు..!

**- మహామండలేశ్వర్ సిద్ధేశ్వరానందగిరి**
**- భక్తిశ్రద్ధలతో శ్రావణ వేడుకలు**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 23, జహీరాబాద్:**
యువకులు, విద్యార్థులు సాంకేతిక పరికరాల కోసం తల్లిదండ్రులపై ఒత్తిడి చేయడం సరికాదని తెలుగు రాష్ట్రాల మహామండలేశ్వర్, బర్దిపూర్ దత్తగిరి మహారాజ్ ఆశ్రమ పీఠాధిపతి డాక్టర్ సిద్ధేశ్వరానందగిరి అన్నారు. శ్రావణ మాసం సందర్భంగా ఆదివారం ఆశ్రమంలో జ్యోతిర్లింగాలకు మహారుద్రాభిషేకం, సహస్ర బిల్వార్చన, ఇష్టలింగ పూజ, మహామంగళహారతి నిర్వహించి భక్తులకు ప్రవచనామృతాన్ని అందించారు. విద్యార్థులు, యువత




సెల్‌ఫోన్లు, ఇతర సాంకేతిక పరికరాలను అవసరమైన మేరకే వినియోగించుకోవాలని సూచించారు. ఐఫోన్ కోసం మహారాష్ట్రలో ఇటీవల చోటుచేసుకున్న విషాద ఘటనను ప్రస్తావిస్తూ.. ఖరీదైన ఫోన్ విషయంలో జరిగిన వివాదం ఒకే కుటుంబంలో ముగ్గురి ప్రాణాలను బలిగొందని తెలిపారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా యువకులు, విద్యార్థులు కోరికలను అదుపులో ఉంచుకోవాలన్నారు. ప్రతిరోజూ రాత్రి బసవపురాణం, భజన సంకీర్తనలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో నందినిగిరి మాత, అర్చకులు శ్రీపాద్ స్వామి, నాగయ్య స్వామి, వేద పాఠశాల విద్యార్థులు, వివిధ ప్రాంతాల భక్తులు పాల్గొన్నారు.

# బోనం ఎత్తిన భానుక నర్మదా మల్లికార్జున్

**కంటోన్మెంట్‌లోని పలు వార్డుల్లో శ్రావణ మాస బోనాల వేడుకలు**

**హైదరాబాద్ పల్స్, ఆగస్టు 23, కంటోన్మెంట్:**
శ్రావణ మాస బోనాల పండుగ సందర్భంగా కంటోన్మెంట్ బోర్డు సభ్యురాలు భానుక నర్మదా మల్లికార్జున్ ఆదివారం పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నానగర్‌లోని పోచమ్మ దేవాలయం, పెద్దమ్మ దేవాలయం, శ్రీ బీరప్ప స్వామి ఆలయంలో బోనం



ఎత్తి అమ్మవారికి మొక్కులు చెల్లించారు. అనంతరం రెండో, మూడో వార్డుల్లో నిర్వహించిన సామూహిక బోనాల వేడుకల్లో పాల్గొన్నారు. రెండో వార్డులోని ఎల్లమ్మ తల్లి ఆలయం, మల్లికార్జున స్వామి ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా భానుక నర్మదా మల్లికార్జున్ మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగను ప్రజలందరూ ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మహంకాళి జిల్లా ఉపాధ్యక్షుడు బి.ఎన్. శ్రీనివాస్, వార్డు అధ్యక్షులు, బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# బాచుపల్లిలో ఘనంగా బోనాల జాతర

**కొలను హనుమంత్ రెడ్డి ఆధ్వర్యంలో వేడుకలు**



**ఆగస్ట్ 23, బాచుపల్లి (హైదరాబాద్ పల్స్ ప్రతినిధి):**
కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బాచుపల్లిలో బోనాల జాతరను భక్తిశ్రద్ధలతో, అంగరంగ వైభవంగా నిర్వహించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలను హనుమంత్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు భక్తులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బోనాల జాతర సందర్భంగా నిర్వహించిన పలారం బండి ఊరేగింపు భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. సంప్రదాయ వేషధారణలు, డప్పు చప్పుళ్లు, కళాకారుల ప్రదర్శనలతో బాచుపల్లి వీధులు పండుగ వాతావరణాన్ని సంతరించుకున్నాయి. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని బోనాలు సమర్పించి అమ్మవారిని భక్తిశ్రద్ధలతో కొలిచారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ –– మల్కాజిగిరి జిల్లా సాంస్కృతిక సేన అధ్యక్షులు దొడ్డు రాహుల్, మేడ్చల్ జిల్లా కన్వీనర్ ఎం.జె.ఎఫ్. జోగు వెంకట్, మేడ్చల్––మల్కాజిగిరి జిల్లా ఫిషర్మెన్ చైర్మన్ మన్నె రాజు, మాజీ కార్పొరేటర్ కె.ఎం. గౌరీష్, మాజీ సర్పంచ్ మైసగిరి శ్రీనివాస్, హేమంత్, సల్మాన్ రాజ్, బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# మృతుని కుటుంబానికి బిర్ల ఫౌండేషన్ బియ్యం పంపిణీ



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 23, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** యాదాద్రి భువనగిరి జిల్లా, రాజపేట మండల కేంద్రంలో ఇటీవల మరణించిన సిరిపంగా నరసింహులు కుటుంబానికి ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య సతీమణి బిర్ల ఫౌండేషన్ చైర్మన్ బీర్ల అనిత సహకారంతో 50 కేజీల బియ్యం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నవీన్ కుమార్, రాజపేట టౌన్ అధ్యక్షులు పెండికూర మహేష్, రేగు సిద్ధులు, ఎర్రగోకుల కిష్టయ్య, కొత్త ఉమేష్, చిగుళ్ల మల్లేష్, ఎర్రగోకుల అశోక్, సిర్పంగ కరుణాకర్ మరియు కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

# 100కు పైగా పుణ్యక్షేత్రాలకు పక్కా రహదారులు

## రూ.120 కోట్లతో 205 కిలోమీటర్ల మేర పనులు

## 26 రహదారుల నిర్మాణం పూర్తి.. మరో 40 శాతం పనులు పురోగతిలో

**అమరావతి, ఆగస్టు 23,(హైదరాబాద్ పల్స్ ప్రతినిధి):** ఆంధ్రప్రదేశ్‌లోని గ్రామీణ ప్రాంతాల్లో ప్రముఖ పుణ్యక్షేత్రాలకు మెరుగైన రహదారి సౌకర్యం కల్పించేందుకు పంచాయతీరాజ్ శాఖ చర్యలు చేపట్టింది. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు 'గుడి బాట' కార్యక్రమం కింద రూ.120 కోట్ల వ్యయంతో 205 కిలోమీటర్ల మేర రహదారుల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. ఈ పనులతో 100కు పైగా ప్రధాన ఆలయాలు అనుసంధానం కానున్నాయి.ఆలయాలతో పాటు గ్రామాల్లోని పాఠశాలలు, ఆసుపత్రులు, పంట పొలాలకు వెళ్లే మార్గాలకు కూడా ప్రాధాన్యం ఇస్తున్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, వీబీ జీ రాం జీ, సాస్కీ తదితర నిధులను వినియోగిస్తున్నారు. రహదారుల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.




**26 రహదారులు పూర్తి**

ఇప్పటికే 26 రహదారుల నిర్మాణ పనులు పూర్తయ్యాయి. మరో 40 శాతం రహదారుల పనులు సగానికి పైగా పూర్తయ్యాయి. అంతర్వేది, అహోబిలం, మదనపల్లి నియోజకవర్గంలోని గట్టు వెంకటరమణ స్వామి ఆలయం, దేవరాయ నల్లగంగమ్మ ఆలయం, మర్రిపూడి సమీపంలోని పుడియగిరి లక్ష్మీ నరసింహస్వామి క్షేత్రం ఘాట్ రోడ్డు పనులు పూర్తయ్యాయి.సత్యవేడు పరిధిలోని సింగిరికోన, సోమేశ్వరం, తలుపులమ్మలోవ, ఐ.ఎస్. జగన్నాథపురం ఘాట్ రోడ్ల పనులు కూడా పూర్తయ్యాయి. వీటిని త్వరలో ప్రారంభించి భక్తులకు అందుబాటులోకి తీసుకురానున్నారు.

**పుట్టపర్తికి రూ.30 కోట్లు**

శ్రీ సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని పుట్టపర్తి అనుసంధాన రహదారుల కోసం ప్రత్యేకంగా రూ.30 కోట్లు కేటాయించారు. దీంతో 72 కిలోమీటర్ల మేర రహదారుల పనులు కొనసాగుతున్నాయి. కోనసీమ తిరుమలగా పేరొందిన వాడపల్లి కరకట్ట మార్గానికి సాస్కీ నిధులు కేటాయించారు. చిత్తూరు జిల్లాలోని అర్ధగిరి ఆంజనేయస్వామి ఆలయ రహదారికి రూ.3 కోట్లు కేటాయించి పనులు చేపట్టారు.నిడదవోలు, రాయచోటి, తెనాలి, పూతలపట్టు నియోజకవర్గాల్లోని వివిధ ఆలయ రహదారుల పనులు కూడా కొనసాగుతున్నాయి. భవిష్యత్తులో మరిన్ని ఆధ్యాత్మిక క్షేత్రాలకు మెరుగైన రహదారి సౌకర్యం కల్పించేలా పంచాయతీరాజ్ శాఖ ప్రణాళికలు రూపొందిస్తోంది.

# సౌందర్య సంరక్షణ, వృత్తి శిక్షణకు అకాడమీ వేదికగా నిలవాలి

### పటాన్‌చెరులో హెచ్ఆర్ లక్స్ స్టూడియో ప్రారంభం
### త్వరలో బ్యూటీ అకాడమీ ఏర్పాటు: డాక్టర్ ప్రీతి రెడ్డి

**పటాన్‌చెరు, ఆగస్టు 23 (హైదరాబాద్ పల్స్ న్యూస్):** పటాన్‌చెరులో త్వరలో ఏర్పాటు చేయనున్న బ్యూటీ అకాడమీ సౌందర్య సంరక్షణతో పాటు యువతకు వృత్తిపరమైన శిక్షణ అందించే వేదికగా నిలవాలని మల్లారెడ్డి విశ్వవిద్యాలయం వైస్ చైర్మన్ డాక్టర్ ప్రీతి రెడ్డి అన్నారు. పటాన్‌చెరులో 'హెచ్ఆర్ లక్స్ స్టూడియో'ను ఆమె ప్రారంభించారు. కార్యక్రమానికి పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి హాజరయ్యారు.'మిసెస్ యూనివర్స్ ఇంటర్నేషనల్ గ్లోబల్ క్వీన్--2025' విజేత హేమలత రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ స్టూడియోలో మహిళలు, పురుషులకు కేశ సంరక్షణ, చర్మ సంరక్షణ, నెయిల్ కేర్, ఫేషియల్స్, మేకప్, హెయిర్ స్టైలింగ్, పర్మనెంట్ మేకప్ తదితర సేవలు అందుబాటులో ఉంటాయి. వ్యక్తిగత గోప్యతకు ప్రాధాన్యమిస్తూ ప్రత్యేక గదులు, ప్రత్యేక చికిత్సా సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.డాక్టర్ ప్రీతి రెడ్డి మాట్లాడుతూ.. బ్యూటీ, వెల్నెస్ రంగాల్లో నైపుణ్యం సాధించిన హేమలత రెడ్డి ఆధ్వర్యంలో స్టూడియో ఏర్పాటవడం అభినందనీయమన్నారు. ఇది సాధారణ బ్యూటీ పార్లర్‌గా కాకుండా వృత్తిపరమైన విద్య, సృజనాత్మకత, ఉపాధి అవకాశాలను కలిపే వేదికగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.హేమలత రెడ్డి మాట్లాడుతూ.. స్టూడియో ప్రారంభించిన నెల రోజుల్లోనే 'హెచ్ఆర్ లక్స్ స్టూడియో బ్యూటీ అకాడమీ'ని ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. ఔత్సాహిక మేకప్ కళాకారులు, బ్యూటీ నిపుణులకు పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా ప్రాక్టికల్ శిక్షణ అందించడమే అకాడమీ లక్ష్యమన్నారు.ప్రొఫెషనల్ మేకప్, హెయిర్ స్టైలింగ్, నెయిల్ ఆర్ట్, చర్మ--సౌందర్య సేవలు, పర్మనెంట్ మేకప్ తదితర అంశాల్లో శిక్షణ అందించేలా అకాడమీని రూపొందిస్తున్నట్లు తెలిపారు. పటాన్‌చెరు పరిసర ప్రాంతాల యువత శిక్షణ కోసం హైదరాబాద్‌లోని ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే నాణ్యమైన శిక్షణ అందించాలన్నదే తమ ఉద్దేశమన్నారు.బ్రైడల్, హెచ్‌డీ బ్రైడల్, ఎయిర్‌బ్రష్, రిసెప్షన్, ఎంగేజ్‌మెంట్, పార్టీ మేకప్‌తో పాటు హెయిర్ ట్రీట్మెంట్స్, హెయిర్ కలరింగ్, నెయిల్ ఆర్ట్, స్కిన్ కేర్, శారీ డ్రేపింగ్, పెళ్లి చీరలు, ఆభరణాల అద్దె తదితర సేవలను కూడా స్టూడియోలో అందిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.అకాడమీ కోర్సులు, పాఠ్యప్రణాళిక, బ్యాచ్‌లు, ధ్రువపత్రాలు, అధ్యాపకులు, ప్రవేశాలకు సంబంధించిన పూర్తి వివరాలను ప్రారంభోత్సవ సమయంలో వెల్లడించనున్నట్లు తెలిపారు.








## మాట వినని పాకిస్థాన్.. మరోసారి
# 'ఆపరేషన్ సింధూర్' పై భారత్ నిర్ణయం..?

### ఆపరేషన్ సింధూర్ తర్వాత పాక్‌లో ఉగ్ర స్థావరాల పునర్నిర్మాణం?
### ధ్వంసమైన జైషే మహమ్మద్ స్థావరం తిరిగి నిర్మిస్తున్నట్లు ప్రచారం
### భారత్ హెచ్చరికలను పాక్ పట్టించుకోవడం లేదని నివేదికలు

**హైదరాబాద్, ఆగస్టు 23 (హైదరాబాద్ పల్స్ ప్రతినిధి):** పహల్గామ్ ఉగ్రదాడి అనంతరం భారత్ చేపట్టిన ఆపరేషన్ సింధూర్‌లో ధ్వంసమైన పాకిస్థాన్‌లోని ఉగ్రవాద స్థావరాలను తిరిగి నిర్మిస్తున్నట్లు పలు నివేదికలు పేర్కొంటున్నాయి. పాకిస్థాన్‌లోని పంజాబ్ ప్రావిన్స్ బహావల్‌పూర్‌లో ఉన్న జైషే మహమ్మద్ సంస్థకు చెందిన మార్కజ్ సుభానల్లా సముదాయాన్ని పునర్నిర్మించినట్లు సామాజిక మాధ్యమాల్లో ఫొటోలు, వీడియోలు ప్రచారంలోకి వచ్చాయి.ఆపరేషన్ సింధూర్ సందర్భంగా ఈ సముదాయం తీవ్రంగా దెబ్బతిన్నట్లు సమాచారం. ప్రస్తుతం అక్కడి అంతర్గత ప్రధాన మందిరాన్ని పునర్నిర్మించి, కొత్త రంగులు వేయడంతో పాటు మార్బుల్ నేల ఏర్పాటు చేసినట్లు ప్రచారం జరుగుతోంది. ధ్వంసమైన నిర్మాణాన్ని



సుమారు 15 నెలల్లోనే తిరిగి నిర్మించినట్లు నివేదికలు పేర్కొంటున్నాయి.ఆపరేషన్ సింధూర్ అనంతరం జైషే మహమ్మద్‌కు పాకిస్థాన్ ప్రభుత్వం సుమారు రూ.25 కోట్ల మేర ఆర్థిక సహాయం అందించినట్లు కొన్ని నివేదికలు వెల్లడించాయి. ఇందులో సుమారు రూ.11 కోట్లు బహావల్‌పూర్‌లోని సుభానల్లా సముదాయం పునర్నిర్మాణానికి వినియోగించినట్లు పేర్కొన్నాయి. అయితే ఈ వివరాలకు స్వతంత్ర ధ్రువీకరణ అందుబాటులో లేదు.మరోవైపు జైషే మహమ్మద్ వ్యవస్థాపకుడు మసూద్ అజార్ అనారోగ్య కారణాలతో సంస్థ కార్యకలాపాలకు దూరంగా ఉన్నట్లు కొన్ని నివేదికలు చెబుతున్నాయి. సంస్థ కార్యకలాపాలను అతని సోదరులు తల్హా అల్ సైఫ్, మోహియుద్దీన్ ఔరంగజేబ్ అలియాస్ అమ్మార్ అల్‌వి పర్యవేక్షిస్తున్నట్లు సమాచారం.పాకిస్థాన్ ఉగ్రవాద కార్యకలాపాలను కొనసాగిస్తే భారత్ కఠినంగా స్పందిస్తుందనే హెచ్చరికలు ఇప్పటికే వెలువడ్డాయి. జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ కూడా దేశ భద్రత విషయంలో అవసరమైన నిర్ణయాలు తీసుకోవడంలో భారత్ వెనుకాడబోదని స్పష్టం చేసినట్లు నివేదికలు పేర్కొంటున్నాయి.

# మృతుని కుటుంబానికి బిర్ల ఫౌండేషన్ బియ్యం పంపిణీ

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 23, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** యాదాద్రి భువనగిరి జిల్లా, రాజపేట మండల కేంద్రంలో ఇటీవల మరణించిన సిరిపంగా నరసింహులు కుటుంబానికి ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య సతీమణి బిర్ల ఫౌండేషన్ చైర్మన్ బీర్ల అనిత సహకారంతో 50 కేజీల బియ్యం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నవీన్ కుమార్, రాజపేట టౌన్ అధ్యక్షులు పెండికూర మహేష్, రేగు సిద్ధులు, ఎర్రగోకుల కిష్టయ్య, కొత్త ఉమేష్, చిగుళ్ల మల్లేష్, ఎర్రగోకుల అశోక్, సిర్పంగ కరుణాకర్ మరియు కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు



# శ్రావణ పుత్రదా ఏకాదశి విశిష్టత

### సంతాన ప్రాప్తి, కుటుంబ శ్రేయస్సు కోసం పుత్రదా ఏకాదశి వ్రతం

**న్యాల్కల్, ఆగస్టు 23 (హైదరాబాద్ పల్స్ ప్రతినిధి):** శ్రావణ మాసం శుక్ల పక్షంలో వచ్చే ఏకాదశిని శ్రావణ పుత్రదా ఏకాదశిగా పిలుస్తారు. సంతాన ప్రాప్తిని కోరుకునే దంపతులకు ఈ ఏకాదశి ఎంతో విశిష్టమైనదిగా భావిస్తారు.పురాణ కథనం ప్రకారం.. లోమశ మహర్షి సూచన మేరకు మహిజిత్తు మహారాజు పుత్రదా ఏకాదశి వ్రతాన్ని ఆచరించగా పుత్రసంతానం కలిగినట్లు తెలుస్తోంది. దీంతో సంతాన ప్రాప్తిని కోరుకునే వారు ఈ రోజున భక్తిశ్రద్ధలతో ఏకాదశి వ్రతాన్ని ఆచరిస్తారు.ఈ సందర్భంగా భక్తులు ఉపవాసం ఉండి, రాత్రి జాగరణ చేస్తూ శ్రీమహావిష్ణువును పూజిస్తారు. పుత్రదా ఏకాదశి వ్రతాన్ని ఆచరించడం వల్ల సంతాన ప్రాప్తి కలగడంతో పాటు, సంతానం ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లుతారని భక్తుల విశ్వాసం. కుటుంబంలో యోగక్షేమాలు అభివృద్ధి చెందుతాయని, సకల పాపాలు తొలగిపోయి మోక్షప్రాప్తి కలుగుతుందని ఏకాదశి మహత్యం పేర్కొంటుంది.





# నూతన వధూవరులను ఆశీర్వదించిన మున్సిపల్ చైర్మన్ దంపతులు

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 23, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** వలిగొండలో చందుపట్ల మాజీ సర్పంచ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు వళ్ళంశెట్టి ఆదినారాయణ కుమారుడి వివాహ వేడుకల్లో భువనగిరి మున్సిపల్ చైర్మన్ దంపతులు తంగాళ్లపల్లి శ్రీవాణి రవి కుమార్, టీపీసీసీ సభ్యులు తంగాళ్లపల్లి రవి కుమార్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.



# తాళ్లూరి బాబు కుటుంబమే నా బలం.. గంగాధర్ చెట్టు నీడలోనే నా జీవితం

**హైదరాబాద్ పల్స్, ఆగస్టు 23, డోర్నకల్ :** నా ప్రతి అడుగు తాళ్ళూరి బాబు, కుటుంబం కోసమే.. ప్రాణం ఉన్నంతకాలం తాళ్లూరి గంగాధర్ చెట్టు కిందే ఉంటా.. ఈ జన్మకు అదే నాకు సింహాసనం" అంటూ డోర్నకల్ మండలం ములకలపల్లి గ్రామానికి చెందిన షేక్ జానీ ఆదివారం భావోద్వేగంతో పేర్కొన్నారు. దివంగత తాళ్ళూరి బాబు ,ఆరో వర్ధంతి సందర్భంగా ఆయనను స్మరించుకుంటూ షేక్ జానీ మాట్లాడారు. తాళ్లూరి బాబుతో డోర్నకల్ మండలం తో పాటు చుట్టుపక్కల గ్రామాలకు ఉన్న అనుబంధం మాటల్లో చెప్పలేనిదని, ఆయన చూపించిన ఆప్యాయత, ఆదరణను జీవితాంతం మరచిపోలేరని అన్నారు. బాబు కుటుంబంతో ఏర్పడిన అనుబంధాన్ని కేవలం పరిచయంగా కాకుండా కుటుంబ బంధంగా భావిస్తున్నానని తెలిపారు. తాళ్ళూరి బాబు కుమారుడు తాళ్ళూరి గంగాధర్ తనకు ఎంతో ఆత్మీయుడని, గంగాధర్ వెంటే తన ప్రయాణం కొనసాగుతుందని స్పష్టం చేశారు. "గంగాధర్ నా శ్వాస.. ఆయన కుటుంబం నా కుటుంబం. ఎన్ని పరిస్థితులు ఎదురైనా ఈ బంధం నుంచి వెనక్కి తగ్గను" అని అన్నారు. తాళ్ళూరి బాబు లేని లోటు ఎప్పటికీ తీరదని, అయితే ఆయన కుటుంబంతో కొనసాగుతున్న అనుబంధమే తనకు ఆత్మస్థైర్యాన్ని ఇస్తోందని షేక్ జానీ పేర్కొన్నారు. బాబు జ్ఞాపకాలను గుండెల్లో నిలుపుకుని, ఆయన కుటుంబానికి అండగా ఉండటమే తన జీవితంలో గొప్ప బాధ్యతగా భావిస్తున్నానని తెలిపారు.

# బసంతాపురం గ్రామంలో వర్షాలు కురవాలని బొడ్రాయికి ప్రత్యేక పూజలు



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 23, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** యాదాద్రి భువనగిరి జిల్లా, రాజపేట మండలం బసంతాపురం గ్రామంలో వర్షాలు లేక కరువు పరిస్థితులు నెలకొంటున్న నేపథ్యంలో, గ్రామ సర్పంచ్ మెండు రత్నమాల సత్తిరెడ్డి ఆధ్వర్యంలో బొడ్రాయికి నీళ్లతో ప్రత్యేక పూజలు చేయడం జరిగింది. అలాగే మహిళలు బతుకమ్మ ఆటలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో పాల్గొని, బొడ్రాయికి నీళ్లు పోసి వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు పండాలని, గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థించారు. బసంతాపురం గ్రామంలో వర్షాలు సమృద్ధిగా కురవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంబీఆర్ ఫౌండేషన్ చైర్మన్ మెండు భాస్కర్ రెడ్డి, గుల్లపల్లి శ్రీనివాస్ గౌడ్, మెండు మహేందర్ రెడ్డి, మెండు మణికుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# భోంగొండ మహారాజ్ విగ్రహావిష్కరణ

### పాల్గొన్న జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు



**హైదరాబాద్ పల్స్, న్యాల్కల్, ఆగస్టు 23:** సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గం న్యాల్కల్ మండలం కల్బేమల్ గ్రామంలో భోంగొండ మహారాజ్ విగ్రహావిష్కరణ కార్యక్రమం ఆదివారం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు పాల్గొని భోంగొండ మహారాజ్ ఆశీస్సులు ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. ప్రజల విశ్వాసానికి, ఆధ్యాత్మికతకు ప్రతీకగా నిలిచే విగ్రహావిష్కరణ కార్యక్రమానికి గ్రామస్థులు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమంలో జహీరాబాద్ మండల పార్టీ అధ్యక్షుడు తట్టు నారాయణ, ఝరాసంఘం మండల పార్టీ అధ్యక్షుడు వెంకటేశం, మాజీ ఆత్మ చైర్మన్ విజయ్ కుమార్, ఎఫ్ఎంసీ చైర్మన్ సత్యం ముదిరాజ్, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు నరసింహారెడ్డి, రాజేందర్ రెడ్డి, సర్పంచులు ప్రవీణ్, బి.ప్రవీణ్, నాయకులు రవికుమార్, మారుతి, వినోద్, మల్‌రెడ్డి, పీటర్, ఇమ్రాన్, చంద్రు, గ్రామ సర్పంచ్ శివకుమార్, మాజీ సర్పంచ్ మహిపాల్, పార్టీ అధ్యక్షుడు బి.శంకర్, మారుతి పాటిల్, చంద్రన్న, శివన్న, నవీన్, నాగేష్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# రూప్ల తండాలో ఘనంగా తీజ్ వేడుకలు

### సంప్రదాయ పద్ధతుల్లో ప్రత్యేక పూజలు.. ఉత్సాహంగా పాల్గొన్న తండావాసులు



**హైదరాబాద్ పల్స్, ఆగస్టు 23, నరసింహులపేట:** నరసింహులపేట మండలం కౌసల్యాదేవిపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని రూప్ల తండాలో తీజ్ వేడుకలను తండావాసులు ఘనంగా నిర్వహించారు. గిరిజన సంప్రదాయాలు, ఆచారాలకు అనుగుణంగా జరిగిన ఈ వేడుకల్లో మహిళలు, యువతులు, చిన్నారులు, యువత, పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళలు, యువతులు సంప్రదాయ పద్ధతుల్లో తీజ్ వేడుకలు నిర్వహిస్తూ ప్రత్యేక పూజలు చేశారు. తీజ్ పండుగ విశిష్టతను గుర్తుచేసుకుంటూ వివిధ సంప్రదాయ కార్యక్రమాలను నిర్వహించారు. దీంతో తండాలో పండుగ వాతావరణం నెలకొంది. గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించేందుకు ఇలాంటి వేడుకలు దోహదపడతాయని తండావాసులు తెలిపారు. వేడుకల్లో పాల్గొన్న వారు పరస్పరం శు భాకాంక్షలు తెలుపుకుంటూ ఆనందంగా గడిపారు.

# సొంత గూటికి చేరిన గండి వెంకటేష్

### బీఆర్ఎస్ బలోపేతమే లక్ష్యం
### ఉద్యమ జెండా మోసిన పార్టీకి పునరాగమనం

**మహబూబాబాద్, ఆగస్టు 23 (హైదరాబాద్ పల్స్ జిల్లా ప్రతినిధి):** మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం పేరుమండ్ల సంకీస గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు గండి వెంకటేష్ తిరిగి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. డోర్నకల్ పట్టణంలో మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ సమక్షంలో బీఆర్ఎస్ కండువా కప్పుకుని పార్టీలో పునరాగమనం చేశారు. ఆయన చేరికతో గ్రామంలోని బీఆర్ఎస్ శ్రేణుల్లో నూతన ఉత్సాహం నెలకొంది. ఈ సందర్భంగా గండి వెంకటేష్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ఉద్యమం ప్రారంభ దశలోనే పేరుమండ్ల సంకీస గ్రామంలో పార్టీ జెండాను మోసి, పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కీలకంగా పనిచేశానని తెలిపారు. అనివార్య పరిస్థితుల కారణంగా



కొంతకాలం ఇతర పార్టీల్లో కొనసాగాల్సి వచ్చినప్పటికీ, బీఆర్ఎస్‌తో తన అనుబంధం ఎప్పటికీ విడదీయరానిదని పేర్కొన్నారు. తిరిగి సొంత గూటికి చేరడం సంతోషంగా ఉందన్నారు. ఇకపై పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడమే తన ప్రధాన లక్ష్యమని తెలిపారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆదేశాలు, మార్గదర్శకాలకు అనుగుణంగా పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానన్నారు. గ్రామస్థాయిలో కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ పార్టీకి పూర్వ వైభవం తీసుకురావడానికి శక్తివంచన లేకుండా పనిచేస్తానని చెప్పారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ, ప్రజల్లో పార్టీపై విశ్వాసాన్ని మరింత పెంచేందుకు కృషి చేస్తానని గండి వెంకటేష్ స్పష్టం చేశారు.

# జాబిల్లిపై జయకేతనం.. నిత్య నూతనం

### చంద్రయాన్-3 విజయానికి మూడేళ్లు.. చంద్రుడి దక్షిణ ధ్రువంపై భారత్ చారిత్రక అడుగు

**హైదరాబాద్ పల్స్, ఆగస్టు 23, సెంట్రల్ డెస్క్:** భారత అంతరిక్ష పరిశోధన సంస్థ చేపట్టిన చంద్రయాన్-3 ప్రయోగం విజయవంతమై నేటికి మూడేళ్లు పూర్తయ్యాయి. 2023 ఆగస్టు 23న సాయంత్రం 6:04 గంటలకు విక్రమ్ ల్యాండర్ చంద్రుడిపై విజయవంతంగా సాఫ్ట్ ల్యాండింగ్ కావడంతో భారత్ అంతరిక్ష చరిత్రలో సరికొత్త అధ్యాయాన్ని లిఖించింది. చంద్రుడి దక్షిణ ధ్రువ ప్రాంతంలో సాఫ్ట్ ల్యాండింగ్ చేసిన తొలి దేశంగా భారత్ చరిత్ర సృష్టించింది. అంతకుముందు చంద్రయాన్-2 చివరి దశలో విఫలమైనప్పటికీ, ఆ అనుభవాలను పాఠాలుగా మలుచుకున్న భారత అంతరిక్ష శాస్త్రవేత్తలు చంద్రయాన్-3ను అత్యంత విజయవంతంగా నిర్వహించారు. విక్రమ్ ల్యాండర్



నుంచి బయటకు వచ్చిన ప్రజ్ఞాన్ రోవర్ చంద్రుడి ఉపరితలంపై పరిశోధనలు నిర్వహించి కీలక సమాచారాన్ని అందించింది. ఈ విజయంతో చంద్రుడిపై సాఫ్ట్ ల్యాండింగ్ సాధించిన నాలుగో దేశంగా భారత్ నిలిచింది. చంద్రయాన్-3 ల్యాండర్ దిగిన ప్రాంతానికి 'శివశక్తి పాయింట్'గా పేరు పెట్టారు. అలాగే ఆగస్టు 23ను జాతీయ అంతరిక్ష దినోత్సవంగా నిర్వహిస్తున్నారు. దేశవ్యాప్తంగా విద్యాసంస్థల్లో అంతరిక్ష పరిశోధనలపై అవగాహన కార్యక్రమాలు, సదస్సులు నిర్వహిస్తూ యువతలో శాస్త్రీయ ఆలోచనలను పెంపొందిస్తున్నారు. చంద్రయాన్-3 రూపకల్పన, నిర్మాణం, ప్రయోగంలో దేశంలోని పలు ఇస్రో కేంద్రాలు కీలక పాత్ర పోషించాయి. హైదరాబాద్‌లోని జాతీయ దూర సంవేదన కేంద్రం సహా పలు సంస్థలు ఈ ప్రతిష్ఠాత్మక ప్రయోగంలో భాగస్వామ్యమయ్యాయి. అమెరికా, యూరప్‌కు చెందిన అంతరిక్ష పరిశోధన సంస్థలు కూడా సాంకేతిక సహకారం అందించాయి. చంద్రయాన్-3 విజయం భారత శాస్త్ర, సాంకేతిక సామర్థ్యానికి ప్రపంచస్థాయిలో గుర్తింపు తీసుకువచ్చిన ఘనతగా నిలిచింది.

# వృద్ధాప్య పింఛన్ దరఖాస్తులు వెంటనే ప్రారంభించాలి

### అర్హులైన ప్రతి వృద్ధుడికి సామాజిక భద్రత కల్పించాలి
### బీజేపీ మండల అధ్యక్షుడు మల్లేష్ గంగ్వార్

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 23, న్యాల్కల్ :** న్యాల్కల్ మండలం గంగ్వార్ చౌరస్తా వద్ద బీజేపీ మండల అధ్యక్షుడు మల్లేష్ గంగ్వార్ పార్టీ ముఖ్య నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం వృద్ధాప్య పింఛన్ కొత్త దరఖాస్తుల స్వీకరణను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని వృద్ధులు, పేదలు, నిరుపేద కుటుంబాలకు సామాజిక భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. వృద్ధాప్యంలో జీవనాధారం లేక ఇబ్బందులు పడుతున్న అర్హులైన అనేక మంది వృద్ధులకు ఇప్పటికీ పింఛన్ అందడం లేదని పేర్కొన్నారు. ఆగస్టు 22, 2026 నాటికి రాష్ట్రవ్యాప్తంగా 16,36,604 మంది వృద్ధాప్య పింఛన్ లబ్ధిదారులు ఉన్నట్లు అధికారిక ఆసరా పింఛన్ డ్యాష్‌బోర్డ్ గణాంకాలు వెల్లడిస్తున్నాయని తెలిపారు. అయితే అర్హత



ఉన్నప్పటికీ పింఛన్ అందని వృద్ధులను గుర్తించేందుకు గ్రామాలు, మున్సిపాలిటీల వారీగా కొత్త దరఖాస్తులు స్వీకరించాలని కోరారు. వృద్ధాప్య పింఛన్ ప్రభుత్వ దానం కాదని, వృద్ధులు ఆత్మగౌరవంతో జీవించేందుకు కల్పించాల్సిన సామాజిక భద్రత అని మల్లేష్ గంగ్వార్ అన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హత ఉన్న ప్రతి వృద్ధుడికి పింఛన్ అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కొత్త దరఖాస్తుల స్వీకరణతో పాటు గ్రామాలు, మున్సిపాలిటీల వారీగా ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేయాలని, పెండింగ్ దరఖాస్తులను పరిశీలించి అర్హులకు పింఛన్ మంజూరు చేయాలని కోరారు. అర్హత ఉన్న ఏ ఒక్క వృద్ధుడు కూడా పింఛన్‌కు దూరం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అర్హులైన ప్రతి వృద్ధుడికి సామాజిక భద్రత కల్పించే వరకు బీజేపీ ప్రజల తరఫున పోరాటం కొనసాగిస్తుందని మల్లేష్ గంగ్వార్ స్పష్టం చేశారు.

# తాజ్‌పూర్‌లో ఘనంగా భక్తిశ్రద్ధలతో బోనాల పండుగ

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 23, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** యాదాద్రి భువనగిరి జిల్లా, భువనగిరి మండలం తాజ్‌పూర్ గ్రామంలో బోనాల పండుగను గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ ర్యాకల సంతోష శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. డప్పు చప్పుళ్లు, శివశక్తుల శిగలతో పండుగ వాతావరణం నెలకొంది. మహిళలు సాంప్రదాయబద్ధంగా బోనాలను అలంకరించుకుని, తలపై బోనాలతో ఊరేగింపుగా గ్రామంలోని గ్రామదేవతల ఆలయాల వద్దకు చేరుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవార్లకు బోనాలు సమర్పించారు. గ్రామదేవతల ఆశీస్సులతో గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని, గ్రామంలో ఎలాంటి కష్టాలు, అనారోగ్యాలు లేకుండా ప్రశాంత వాతావరణం నెలకొనాలని భక్తులు కోరుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ర్యాకల సంతోష శ్రీనివాస్ మాట్లాడుతూ.. బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. గ్రామదేవతలను భక్తిశ్రద్ధలతో కొలుచుకోవడం ఆనవాయితీగా వస్తోందని, ప్రతి ఏటా గ్రామంలో బోనాల పండుగను ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. గ్రామ ప్రజలంతా ఐకమత్యంతో పండుగలో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, గ్రామం మరింత అభివృద్ధి చెందాలని అమ్మవార్లను ప్రార్థించినట్లు సర్పంచ్ తెలిపారు. అనంతరం గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకున్నారు. డప్పు చప్పుళ్లు, శివశక్తుల నృత్యాలతో తాజ్‌పూర్ గ్రామంలో పండుగ సందడి నెలకొంది. భక్తిశ్రద్ధలతో సాగిన బోనాల వేడుకలు గ్రామస్థులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, మహిళలు, యువత, పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొని బోనాల పండుగను విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ వరిగంటి కృష్ణ, వార్డు సభ్యులు పల్లెపాటి కృష్ణ, ఎస్కే గాలిబి యాకుబ్, బొమ్మరపు రామకృష్ణ, బొమ్మారపు లక్ష్మీ బాలరాజు, బిట్కూరు మహేష్, వరిగంటి మానస నాగరాజు, ఎస్కేహైమద్ మరియు గ్రామా ప్రజలు పాల్గొన్నారు.





## యాదాద్రి జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులకు
# నిధులు కేటాయించి వెంటనే పూర్తి చేయాలి

**ఎండి జహంగీర్ సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు**

హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 23, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : ఆదివారం రోజున సిపిఎం ఆలేరు పట్టణ కమిటీ సమావేశము సిపిఎం కార్యాలయంలో మొరిగాడి రమేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి హాజరైన సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎండి జహంగీర్ మాట్లాడుతూ... యాదాద్రి జిల్లాలో పెండింగ్ లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను వెంటనే పూర్తిచేయాలని అదేవిధంగా ఆలేరు ప్రాంతానికి సాగు తాగు నీరు అందించే గంధమల్ల రిజర్వాయర్ త్వరితగతిన పూర్తి చేయాలని అదేవిధంగా గత 15 సంవత్సరాల క్రితం మాజీ ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి హయంలో ఆలేరు ప్రాంతానికి దేవాదుల ద్వారా నీళ్లు అందించే లక్ష్యంతో కాలువలు నిర్మాణం చేయడం జరిగిందని పటేల్ గూడెం టంగుటూరు గ్రామాల మీదుగా ప్రాంతాలకి నీరు అందించడం కోసం కాలువలు తీసి నీటి విడుదల మర్చిపోయారని కోట్లాది రూపాయల ప్రజాధనం మట్టిపాలు చేశారని ఆయన ఈ సందర్భంగా ఆవేదన వ్యక్తం చేశారు. గంధమల్ల రిజర్వాయర్ ను పూర్తి చేస్తామని చెప్పిన ప్రభుత్వం రెండున్నర సంవత్సరాలు గడిచిపోయిందని నిధులు కేటాయించినప్పటికీ ఇప్పటివరకు తట్టుడు మట్టి తీయలేదని పనులు ఇంకా ప్రారంభం కాలేదని గతంలో గంధమల్ల రిజర్వాయర్ ను 11 టిఎంసిలుగా చెప్పారని తర్వాత ఆరు టీఎంసీలు అని చెప్పి ఇప్పుడు కేవలం 1.41 టీఎంసీలతో సరిపెట్టారని ఆ పని కూడా అతిగతి లేకుండా ఉందని ప్రాజెక్టును డిజైన్ మార్చడం వల్ల ఎన్ని వేల ఎకరాలకు ఈ ప్రాజెక్టు నీరు అందిస్తుందో అనే స్పష్టత కూడా లేకుండా పోయిందని అన్నారు వెంటనే సాగు త్రాగునీరు అందించే గంధమల్ల రిజర్వాయర్ ను వెంటనే పూర్తి చేయాలని అదేవిధంగా దేవాదుల ప్రాజెక్టును గతంలో నిర్మించిన కాలువల ద్వారా ఆలేరు ప్రాంతానికి నీరు



అందించాలని ఆయన ఈ సందర్భంగా డిమాండ్ చేశారు రానున్న కాలంలో అన్ని ప్రాజెక్టుల సాధన కోసం రైతులను సమీకరించి పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహించనున్నట్లు ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కల్లూరి మల్లేశం, సిపిఎం జిల్లా నాయకులు ఎంఏ ఇక్బాల్, సిపిఎం నాయకులు వడ్డేమాన్ బాలరాజు, ఘనగాని మల్లేశం, శాంత, చెన్న రాజేష్ తదితరులు పాల్గొన్నారు

# ఖేడ్‌లో వైద్య సేవలకు కొత్త ఊతం

**బాలాజీ అనురాధ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ప్రారంభం.**

**హైదరాబాద్ పల్స్, ఆగస్టు 23, నారాయణఖేడ్:** నారాయణఖేడ్ మున్సిపాలిటీలో వైద్య సేవలకు మరింత ఊతం లభించనుందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. నారాయణఖేడ్ పట్టణంలో ఆధునిక సౌకర్యాలతో ఏర్పాటు చేసిన బాలాజీ అనురాధ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని ఆదివారం స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి, జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్ శెట్కర్‌తో కలిసి మంత్రి ప్రారంభించారు.అనంతరం ఆసుపత్రిలోని వివిధ విభాగాలను పరిశీలించి అందుబాటులో ఉన్న వైద్య సదుపాయాలపై నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. నారాయణఖేడ్ ప్రాంత ప్రజల వైద్య అవసరాలను దృష్టిలో ఉంచుకుని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని ఏర్పాటు చేయడం అభినందనీయమని మంత్రి అన్నారు.తెలంగాణ ప్రభుత్వం విద్య, వైద్య రంగాల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు సమీపంలోనే అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. జిల్లా స్థాయిలోనే అధిక శాతం వైద్య చికిత్సలు అందేలా ప్రజారోగ్య వ్యవస్థను మరింత బలోపేతం చేస్తున్నామని వివరించారు.కార్యక్రమంలో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు, జూకల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు, నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే విజయ్ పాల్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమా హారతి, మున్సిపల్ కమిషనర్ స్రవంతి, డీసీసీ మాజీ చైర్మన్ జైపాల్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ నగేష్ కుమార్ షెట్కార్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పట్లోళ్ల చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకులు పట్లోళ్ల సుధాకర్ రెడ్డి, పీసీసీ





సభ్యుడు కే. శ్రీనివాస్, ఆసుపత్రి నిర్వాహకులు డాక్టర్ పట్లోళ్ల అనురాగ్ రెడ్డి, డాక్టర్ కే. శ్రీధర్, స్థానిక ప్రజాప్రతినిధులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు

## మేడ్చల్ గడిమైసమ్మ దేవస్థానంలో
# ఘనంగా శ్రావణ మాస బోనాల జాతర

**అమ్మవారిని దర్శించుకున్న వివిధ పార్టీల నాయకులు.. భక్తులతో కిక్కిరిసిన ఆలయ ప్రాంగణం**

**హైదరాబాద్ పల్స్, ఆగస్టు 23, మేడ్చల్:** మేడ్చల్ పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయ సమీపంలో ఉన్న శ్రీ గడిమైసమ్మ దేవస్థానంలో శ్రావణ మాస బోనాల జాతరను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. జాతర సందర్భంగా ఆలయాన్ని, పరిసర ప్రాంతాలను వివిధ రకాల పూలు, విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు.మేడ్చల్ గ్రామదేవతగా భక్తుల విశ్వాసాన్ని పొందిన గడిమైసమ్మ తల్లికి ఉదయం నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. మహిళలు సంప్రదాయ వస్త్రధారణలో బోనాలను తీసుకుని వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో బోనాలు, ఒడి బియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు సుమారు రెండు నుంచి మూడు కిలోమీటర్ల మేర క్యూలో నిలబడి అమ్మవారిని దర్శించుకున్నారు.జాతరలో మేడ్చల్ ఎమ్మెల్యే



చామకూర మల్లారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్, బీఆర్ఎస్ నేత పద్మ దేవేందర్ రెడ్డి పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు, పోలీసు అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు, పూజారులు, పట్టణ ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.భక్తులకు ఎలాంటి అసౌకర్యం



కలగకుండా ఆలయ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. శాంతిభద్రతల పరిరక్షణకు మేడ్చల్ పోలీసులు, ట్రాఫిక్ నియంత్రణకు ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు.

# రేణికుంట పద్మశాలి సంఘం నూతన కమిటీ ప్రమాణ స్వీకారం

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 23, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** యాదాద్రి భువనగిరి జిల్లా, రాజపేట మండలం రేణికుంట గ్రామ పద్మశాలి సంఘం నూతన కమిటీ ప్రమాణ స్వీకారం ఆదివారం రోజు ఘనంగా నిర్వహించడం జరిగింది. నూతన అధ్యక్షునిగా బొద్దుల బాల్ నరసయ్య, ఉపాధ్యక్షుడిగా భోగ కృష్ణ మూర్తి, ప్రధాన కార్యదర్శిగా ఎర్రగుంట బాలరాజు, సహాయ కార్యదర్శిగా కొంగరి శ్రీహరి, కోశాధికారిగా కొండ అశోక్, కార్యవర్గ సభ్యులుగా బొమ్మ జనార్ధన్, బొద్దుల ఆదినారాయణ, వడ్లకొండ చంద్రశేఖర్, బిట్ల ఆంజనేయులు,



కొండ భాస్కర్, లు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు బొద్దుల బాల్ నరసయ్య, ఉపాధ్యక్షుడు భోగ కృష్ణ మూర్తి మాట్లాడుతూ... నూతన కార్యవర్గం పద్మశాలి సంఘం అభివృద్ధికి కృషి చేస్తుందని, చేనేత



కార్మికుల సమస్యలు మరియు ప్రభుత్వం నుండి అందవలసిన సంక్షేమ పథకాలు ప్రతి చేనేత కార్మికుడికి అందే విధంగా నూతన కార్యవర్గం కృషి చేస్తుందని తెలియజేశారు.

## తీజ్ వేడుకల్లో
# ప్రభుత్వ విప్ సతీమణి

**గిరిజన సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు ప్రభుత్వం సహకరిస్తుంది: డాక్టర్ ప్రమీల**



**హైదరాబాద్ పల్స్, ఆగస్టు 23, నర్సింహులపేట:** నర్సింహులపేట మండలం గ్యామా తండాలో తీజ్ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే డాక్టర్ రామచంద్రనాయక్ సతీమణి డాక్టర్ ప్రమీల ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజన మహిళల ఐక్యతకు, సంప్రదాయ పరిరక్షణకు తీజ్ వేడుకలు ప్రతీకగా నిలుస్తాయని అన్నారు. తీజ్ పండుగ గిరిజన మహిళల ఆధ్యాత్మిక విశ్వాసానికి, కుటుంబ సౌభాగ్యానికి ప్రతీక అని పేర్కొన్నారు.గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందని తెలిపారు. తండాల్లో సంప్రదాయ పండుగలను ఘనంగా నిర్వహించడం అభినందనీయమన్నారు.కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొబ్బ సోమిరెడ్డి, సమన్వయ కమిటీ చైర్మన్ దస్రునాయక్, మాజీ మండల అధ్యక్షుడు జినుకల రమేష్, సర్పంచ్ జక్కుల ఉప్పలయ్య యాదవ్, ఉప సర్పంచులు కాసా యాకన్న, నవీన్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు చిర్ర సతీష్ గౌడ్, భూక్యా హరిలాల్, అలవాల శీను, యాదగిరి, నిమ్మల శ్రీను, గాడిపల్లి నాగముని, పార్టీ నాయకులు, కార్యకర్తలు, తండా పెద్దలు, మహిళలు, యువత పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన
# ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 23, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** యాదాద్రి భువనగిరి జిల్లా, ఆలేరు పట్టణం లోని భజరంగ్ యూత్ కార్యదర్శి మార్గం క్రాంతి కుమార్ చెల్లి మార్గం నికిత పెళ్లికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యులు, డీసీసీ అధ్యక్షులు బీర్ల ఐలయ్య హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఈరసరపు యాదగిరి, కాంగ్రెస్ పార్టీ మాజీ పట్టణ అధ్యక్షుడు ఎంఏ ఎజాజ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గంధమల్ల అశోక్, భజరంగ్ యూత్ అధ్యక్షుడు సీసా సాయికుమార్, భజరంగ్ యూత్ సభ్యులు మరియు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొని ఆశీర్వదిచారు

## బద్రమ్మ మృతి పట్ల
# తీవ్ర సంతాపం

**కుటుంబాన్ని పరామర్శించిన సర్పంచ్, ఉప సర్పంచ్**



**హైదరాబాద్ పల్స్, ఆగస్టు 23, నర్సింహులపేట:** నర్సింహులపేట మండలం పడమటిగూడెం గ్రామానికి చెందిన వంగాల సారయ్య తల్లి బద్రమ్మ మృతి పట్ల సర్పంచ్ జక్కుల ఉప్పలయ్య, ఉప సర్పంచ్ చిమ్మల నవీన్ రెడ్డి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.బద్రమ్మ మృతి విషయం తెలుసుకున్న వారు కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. తల్లి వంటి ఆప్యాయతను కోల్పోవడం తీరని లోటని, ఆమె మృతి కుటుంబానికే కాకుండా గ్రామానికి కూడా బాధాకరమని పేర్కొన్నారు. కష్టకాలంలో కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.కుటుంబానికి తమ వంతు సహాయంగా 50 కిలోల బియ్యాన్ని అందజేశారు. బద్రమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు విషాదాన్ని తట్టుకునే మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో వార్డు సభ్యులు యాకన్న, సుజాత, యాకయ్య, వెంకటమ్మ, బిక్షం, గ్రామ పెద్దలు ఇరి ప్రతాప్ రెడ్డి, చిర్ర సతీష్, వెంకన్న, జక్కి కృష్ణ, మూర్తి రాములు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహబూబ్ పాషా తదితరులు పాల్గొన్నారు.



# దోమల నివారణకు ఫాగింగ్

**ఆరోగ్య పరిరక్షణకు ముందస్తు చర్యలు.**

**సర్పంచ్ కైలా రవి నాయక్.**

**హైదరాబాద్ పల్స్, ఆగస్టు 23, నర్సింహులపేట:** నర్సింహులపేట మండలంలోని పకీర తండ గ్రామపంచాయతీ పరిధిలోని వివిధ కాలనీల్లో ఆదివారం దోమల నివారణకు ఫాగింగ్ కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ గూగులోతు కైలా రవి నాయక్ పర్యవేక్షణలో పంచాయతీ సిబ్బంది ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామస్తుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని దోమల బెడదను తగ్గించేందుకు, డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఆరోగ్య పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కిషన్ నాయక్, కారోబార్ శ్రీహరి, వార్డు సభ్యులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# మగ ఎలుక కణాల నుంచి సంతానోత్పత్తి సామర్థ్యం ఉన్న ఆడ ఎలుకలు

**జన్యుశాస్త్రంలో సంచలనం.. అరుదైన జంతు జాతుల పరిరక్షణకు కొత్త మార్గం**



**హైదరాబాద్ పల్స్, ఆగస్టు 23:** జన్యుశాస్త్ర పరిశోధనల్లో జపాన్ శాస్త్రవేత్తలు కీలక ముందడుగు వేశారు. మగ ఎలుక శరీరం నుంచి తీసుకున్న కణాలను జన్యు సవరణకు గురిచేసి, సంతానోత్పత్తి సామర్థ్యం ఉన్న ఆడ ఎలుకలను సృష్టించినట్లు పరిశోధకులు వెల్లడించారు. రికెన్ బయోరిసోర్స్ రీసెర్చ్ సెంటర్, యామనాషి విశ్వవిద్యాలయానికి చెందిన శాస్త్రవేత్తలు ఈ ప్రయోగాన్ని నిర్వహించారు. సాధారణంగా మగ జీవుల్లో ఎక్స్‌వై క్రోమోజోమ్‌లు ఉంటాయి. పరిశోధకులు క్రిస్పర్ జన్యు సవరణ సాంకేతికతలో 'వై-కట్' విధానాన్ని ఉపయోగించి మగ ఎలుక కణాల్లోని వై క్రోమోజోమ్‌ను తొలగించారు. అనంతరం ఆ కణాల ఆధారంగా పిండాలను అభివృద్ధి చేసి ఆడ ఎలుకల్లో ప్రవేశపెట్టారు. వీటి నుంచి ఎక్స్‌ఓ క్రోమోజోమ్‌లతో కూడిన ఆడ ఎలుక పిల్లలు జన్మించినట్లు తెలిపారు.

**అరుదైన జంతువుల పరిరక్షణకు ఉపయోగం**

కొన్ని అరుదైన జంతు జాతుల్లో ఆడ జీవులు తగ్గిపోవడం లేదా పూర్తిగా లేకపోవడం వల్ల సంతానోత్పత్తి నిలిచిపోయే పరిస్థితులు ఎదురవుతున్నాయి. అలాంటి సందర్భాల్లో భద్రపరిచిన మగ జీవుల కణజాలం నుంచి ఆడ జీవులను సృష్టించే అవకాశం ఈ సాంకేతికత ద్వారా ఏర్పడవచ్చని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. నార్తర్న్ వైట్ రైనో వంటి అంతరించిపోయే దశలో ఉన్న జంతు జాతుల పరిరక్షణకు భవిష్యత్తులో ఇది ఉపయోగపడే అవకాశం ఉంది. అయితే ప్రస్తుతం ఈ ప్రయోగం ఎలుకలకే పరిమితమైంది. సృష్టించిన పిండాల్లో కొద్ది శాతమే పూర్తిస్థాయిలో అభివృద్ధి చెంది పిల్లలుగా మారుతున్నాయి. ఇతర జంతువుల్లో, ముఖ్యంగా మనుషుల్లో ఈ విధానం ఎంతవరకు పనిచేస్తుందనే అంశంపై మరిన్ని పరిశోధనలు అవసరమని నిపుణులు పేర్కొన్నారు.

# బంగ్లాదేశ్‌లో రిటైర్డ్ ఉపాధ్యాయుడి కుటుంబం దారుణ హత్య

**మాదకద్రవ్యాల వినియోగాన్ని ప్రశ్నించినందుకే ఘాతుకం.. ఇద్దరు అనుమానితుల అదుపులోకి**

**హైదరాబాద్ పల్స్, ఆగస్టు 23, సెంట్రల్ డెస్క్:** బంగ్లాదేశ్‌లోని రంగ్‌పూర్‌లో రిటైర్డ్ హిందూ ఉపాధ్యాయుడి కుటుంబం దారుణ హత్యకు గురైంది. ఇంటిపై మాదకద్రవ్యాలు వినియోగిస్తున్న వారిని ప్రశ్నించినందుకే ఈ ఘటన జరిగినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. 65 ఏళ్ల గణపతి చక్రవర్తి ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పదవీ విరమణ చేసిన అనంతరం హోమియోపతి వైద్యుడిగా పనిచేస్తున్నారు. నాలుగేళ్ల క్రితం రంగ్‌పూర్‌లో ఇల్లు నిర్మించుకుని భార్య ప్రీతిలత, కుమార్తె అగామీ, కుమారుడు ప్రియమ్‌తో కలిసి నివసిస్తున్నారు. ప్రీతిలత సోదరి ఆమెకు ఫోన్ చేయగా ఫోన్ స్విచ్ఛాఫ్ రావడంతో అనుమానం వచ్చి పోలీసులకు సమాచారం అందించారు. శనివారం రాత్రి పోలీసులు ఇంటి తాళాలు పగలగొట్టి పరిశీలించగా నలుగురూ మృతిచెందిన స్థితిలో కనిపించారు. గణపతి మృతదేహం ఇంటిపై, భార్య, కుమార్తె మృతదేహాలు మెట్లపై, కుమారుడి మృతదేహం మంచం కింద గుర్తించారు. గురువారం రాత్రే ఈ హత్యలు జరిగినట్లు పోలీసులు భావిస్తున్నారు. ఇంటిపై మాదకద్రవ్యాలు వినియోగిస్తున్న ఇద్దరిని గణపతి ప్రశ్నించడంతో వారు ఈ ఘాతుకానికి పాల్పడినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలిందని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి అనుమానితులుగా ఇద్దరిని



అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు.

# బాలిలో హిందూ పండుగ నిబంధనలు ఉల్లంఘించిన స్విస్ పర్యాటకుడికి ఏడాది జైలు

**'న్యేపి' పండుగను అవమానించేలా సామాజిక మాధ్యమాల్లో వీడియో.. కోర్టు కఠిన తీర్పు**

**హైదరాబాద్ పల్స్, ఆగస్టు 23, సెంట్రల్ డెస్క్ :** ఇండోనేషియాలోని బాలి ద్వీపంలో పవిత్ర హిందూ పండుగ 'న్యేపి' నిబంధనలను ఉల్లంఘించి, సామాజిక మాధ్యమాల్లో అవమానకరమైన వీడియోను ప్రచురించిన స్విట్జర్లాండ్‌కు చెందిన 26 ఏళ్ల పర్యాటకుడికి కోర్టు ఏడాది జైలు శిక్ష విధించింది. లుజియన్ ఆండ్రిన్ బ్రాగెన్ అనే పర్యాటకుడు మార్చి 19న నిర్వహించిన 'న్యేపి' పండుగ సందర్భంగా నిబంధనలు ఉల్లంఘించి హోటల్ నుంచి బయటకు వచ్చాడు. నిర్మానుష్యంగా ఉన్న బీచ్‌లో తిరుగుతూ వీడియో తీసి సామాజిక మాధ్యమంలో అసభ్య పదజాలంతో ప్రచురించినట్లు అధికారులు తెలిపారు. 'న్యేపి'ని 'నిశ్శబ్ద దినం'గా



పిలుస్తారు. ఈ రోజున బాలి ప్రజలు ఇళ్లకే పరిమితమై పనులు, వినోద కార్యక్రమాలకు దూరంగా ఉంటారు. పర్యాటకులకు కూడా ఈ నిబంధనలు వర్తిస్తాయి. హోటల్ సిబ్బంది ముందుగానే నిబంధనలను వివరించినప్పటికీ అతడు వాటిని ఉల్లంఘించినట్లు అధికారులు తెలిపారు. వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో స్థానికుల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమైంది. దీంతో పోలీసులు అతడిని అరెస్టు చేశారు. కోర్టు విచారణలో తన తప్పును అంగీకరించిన పర్యాటకుడు ఆకలి, అసహనంతో అలా చేశానని పేర్కొంటూ బాలి ప్రజలకు క్షమాపణలు చెప్పాడు. అయినప్పటికీ స్థానికుల మనోభావాలను దెబ్బతీసేలా వ్యవహరించినందుకు కోర్టు ఏడాది జైలు శిక్ష విధించింది. స్థానిక సంప్రదాయాలు, ఆచారాలను ఉల్లంఘించే విదేశీ పర్యాటకులపై బాలి అధికారులు కఠినంగా వ్యవహరిస్తున్న నేపథ్యంలో ఈ తీర్పు ప్రాధాన్యం సంతరించుకుంది.

# రేణికుంటలో భక్తిశ్రద్ధలతో ఏకాదశి నగర సంకీర్తన

**భగవత్ సేవా సమాజం నగర సంకీర్తన**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 23, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి:** యాదాద్రి భువనగిరి జిల్లా, రాజపేట మండలం రేణికుంట గ్రామంలో ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని మర్కుక్ శ్రీ పాండురంగ ఆశ్రమం ఆధ్వర్యంలో శ్రీ అదరాసుపల్లి శ్రీధర్ శర్మ పర్యవేక్షణలో రేణికుంటలోని మహిమాన్వితమైన శ్రీ భవానీ శంకరస్వామి శివాలయం నుండి ఏకాదశి హరే రామ హరే కృష్ణ నామ నగర సంకీర్తన శ్రీ పరాభావ నామ సంవత్సర శ్రావణ మాస శుక్లపక్ష ఏకాదశి పర్వదినం పురస్కరించుకొని ఆదివారం ఉదయం 5:30 నుండి రేణికుంటలోని పురవీదుల గుండా హరే రామ హరే కృష్ణ కీర్తన చేస్తు నగర సంకీర్తన నిర్వహించటం జరిగింది. ముందుగా ఆలయ అర్చకులు శ్రీ రేగొండ పాండురంగం ఏకాదశి పురస్కరించుకుని శ్రీ భవానీ శంకరస్వామి వారికి పంచామృతాలతో రుద్రాభిషేకం నిర్వహించటం



జరిగింది. గ్రామంలోని పురవీదుల గుండా సంకీర్తన నిర్వహించి మరల శివాలయం వద్దకు చేరుకుని తదనంతరం ప్రసాదం నివేదన చేసి మంగళ నీరాజనం సమర్పించి భక్తులకు ప్రసాద వితరణ చేయటం జరిగింది. ఈ కార్యక్రమనికి చిరంజీవి ఆదెపు బాలగణేష్ తన పుట్టినరోజు సందర్భంగా స్వామి వారికి ప్రసాదం అందించటం జరిగింది. బాలగణేష్ కు ఆయురారోగ్యాలతో ఆ భాగవతున్ని కృప ఎల్లవేళల ఉండాలని అర్చకులు శ్రీ రేగొండ పాండురంగం ఆశీర్వచనం అందజేశారు.



# లైబ్రేరియన్ పోస్టుల భర్తీపై శాసన మండలిలో ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని వినతి

**ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను కోరిన లైబ్రరీ సైన్స్ నిరుద్యోగ అభ్యర్థులు**



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 23, తెలంగాణ బ్యూరో :** హైదరాబాద్, తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, పౌర గ్రంథాలయాలు, మెడికల్ కళాశాలలు, ఐటీఐ కళాశాలలు, బీఈడీ, స్పెషల్ ఎడ్యుకేషన్ కళాశాలలు మరియు ఇతర విద్యాసంస్థల్లో ఖాళీగా ఉన్న లైబ్రేరియన్ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ నిరుద్యోగ సంఘం ప్రతినిధులు ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన ఈ సమావేశంలో సిఎల్ఐఎస్సి, బిఎల్ఐఎస్సి, ఎంఎల్ఐఎస్సి వంటి లైబ్రరీ సైన్స్ కోర్సులు పూర్తి చేసిన నిరుద్యోగ అభ్యర్థులు రాష్ట్రంలోని గ్రంథాలయాల ప్రస్తుత పరిస్థితిని ఎమ్మెల్సీ దృష్టికి తీసుకెళ్లారు. పౌర గ్రంథాలయాల్లో సరైన వసతులు లేకపోవడం, పుస్తకాల కొరత, శిక్షణ పొందిన సిబ్బంది లేకపోవడం వల్ల విద్యార్థులు, యువత ప్రైవేట్ స్టడీ సర్కిల్స్‌పై ఆధారపడాల్సి వస్తోందని వారు వివరించారు. గత 35 సంవత్సరాలుగా పౌర గ్రంథాలయాల్లో ప్రత్యక్ష నియామకాలు చేపట్టకపోవడంతో లైబ్రరీ సైన్స్ కోర్సులు పూర్తి చేసిన సుమారు రెండు లక్షల మంది అభ్యర్థులు ఉపాధి అవకాశాల కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న గ్రంథాలయ సిబ్బంది పోస్టులను గుర్తించి వెంటనే భర్తీ చేయాలని కోరారు. ఈ సందర్భంగా అభ్యర్థులు పలు ప్రధాన డిమాండ్లను ఎమ్మెల్సీ ముందు ఉంచారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో గ్రంథాలయాలను ఏర్పాటు చేసి అర్హత కలిగిన లైబ్రేరియన్లను నియమించాలని, మోడల్ స్కూళ్లు, గురుకులాల్లో మంజూరైన పోస్టులను కూడా నియామక ప్రక్రియలో చేర్చాలని కోరారు. అలాగే ప్రైవేట్ పాఠశాలల్లో కూడా గ్రంథాలయాలు, అర్హత కలిగిన లైబ్రరీ సిబ్బంది తప్పనిసరిగా ఉండేలా ప్రత్యేక జీవో జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి గ్రంథాలయాలు అత్యంత అవసరమని అభ్యర్థులు పేర్కొన్నారు. డిజిటల్ యుగంలోనూ పఠన సంస్కృతి, సమాచార సేకరణ, పరిశోధనా దృక్పథం, స్వయంఅభ్యాసాన్ని పెంపొందించడంలో గ్రంథాలయాల పాత్ర కీలకమని తెలిపారు. జాతీయ విద్యా విధానం--2020తో పాటు గత విద్యా విధానాల్లోనూ గ్రంథాలయాల ప్రాధాన్యతను స్పష్టంగా పేర్కొన్న విషయాన్ని గుర్తు చేశారు. అభ్యర్థుల సమస్యలను సానుకూలంగా విన్న ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, రాష్ట్రంలోని గ్రంథాలయాల పరిస్థితి మరియు లైబ్రేరియన్ పోస్టుల భర్తీ అంశాన్ని శాసన మండలిలో ప్రస్తావిస్తానని హామీ ఇచ్చారు. ఈ సమస్యను విద్యాశాఖ మంత్రి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకునేలా కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్. భావన, ఎం. మంజుల, ఎం. సరిత, ఆకుల సాయిలు, పవన్ యాదవ్, శ్రీకాంత్, ఉదయ్, నరేష్ తదితర లైబ్రరీ సైన్స్ అభ్యర్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అభ్యర్థులు "ప్రతి పాఠశాలకు గ్రంథాలయం - ప్రతి గ్రంథాలయానికి అర్హత కలిగిన లైబ్రేరియన్" అనే లక్ష్యంతో ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.

# కొంపల్లిలో బీజేపీ సర్వసభ్య సమావేశం..మోర్చాల నియామకం

### స్థానిక ఎన్నికలకు కార్యకర్తలు సమాయత్తం కావాలి.
### డా. ఎస్. మల్లారెడ్డి

**హైదరాబాద్ పల్స్, ఆగస్టు 23, కొంపల్లి:** కొంపల్లి బీజేపీ అధ్యక్షుడు పెద్దబుద్దుల సతీష్ సాగర్ అధ్యక్షతన ఏఎంఆర్ గార్డెన్స్‌లో బీజేపీ సర్వసభ్య సమావేశం, మోర్చాల నియామకం, ఓటరు జాబితాపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డా. ఎస్. మల్లారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా కొంపల్లి బీజేపీ ఓబీసీ మోర్చా అధ్యక్షుడిగా వల్లపు తిరుపతి, యువ మోర్చా అధ్యక్షుడిగా ఉప్పరి మహేందర్ సాగర్, గిరిజన మోర్చా అధ్యక్షుడిగా వినోద్ కుమార్ నాయక్, మైనార్టీ మోర్చా అధ్యక్షుడిగా మహమ్మద్ మోహన్‌ను నియమించారు.మోర్చాల నాయకులు త్వరలో పూర్తి



కమిటీలను ఏర్పాటు చేసుకుని కొంపల్లి డివిజన్‌లో బీజేపీ విజయానికి కృషి చేయాలని సతీష్ సాగర్ సూచించారు. కుత్బుల్లాపూర్ అసెంబ్లీ బీఎల్ఏ-1 శివాజీ రాజు మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో అర్హులైన ఓటర్ల పేర్లు తొలగిపోకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఎస్ఐఆర్ రెండో దశ కార్యాచరణపై వివరించారు.డా. ఎస్. మల్లారెడ్డి మాట్లాడుతూ నూతనంగా మోర్చా బాధ్యతలు చేపట్టిన వారికి అభినందనలు తెలిపారు. రాబోయే స్థానిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేసి పార్టీ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు ఆదిరెడ్డి రాజిరెడ్డి, ఓబీసీ అధ్యక్షుడు శేఖర్ యాదవ్, కిసాన్ మోర్చా అధ్యక్షుడు మల్లేష్ యాదవ్, గిరిజన మోర్చా అధ్యక్షుడు వెంకటేష్ నాయక్, మాజీ రాష్ట్ర మహిళా మోర్చా నాయకురాలు సరితరావు, జిల్లా నాయకులు జీవన్ రెడ్డి, శంకర్ నాయక్, డివిజన్ నాయకులు నరసింహ, చక్రధర్, మాధురి, ఆశ, దుర్గా, ప్రకాష్ రావు, మహేశ్వర్ రెడ్డి, శ్రీనివాస్, మధు, నర్సింగ్ రావు తదితరులు పాల్గొన్నారు.

# మానుకోటలో బెదిరింపుల దందాకు బ్రేక్ వేయాలి

### అధికారులు, వార్డెన్‌లను లక్ష్యంగా చేసుకుని వేధింపులకు పాల్పడితే సహించేది లేదు.

### గుగులోతు బీమా నాయక్



**మహబూబాబాద్, ఆగస్టు 23 (హైదరాబాద్ పల్స్ ప్రతినిధి):** మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ప్రభుత్వ అధికారులు, హాస్టల్ వార్డెన్‌లపై ఒత్తిళ్లు తీసుకువచ్చి బెదిరింపులకు పాల్పడుతూ డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలపై లంబాడి హక్కుల పోరాట సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుగులోతు బీమా నాయక్ తీవ్రంగా స్పందించారు. విధులు నిర్వహిస్తున్న అధికారులను వ్యక్తిగత ప్రయోజనాల కోసం లక్ష్యంగా చేసుకోవడం దుర్మార్గమైన చర్య అని పేర్కొన్నారు.ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లాల్సిన బాధ్యతను పక్కనపెట్టి కొందరు వ్యక్తులు ఉద్యోగులను భయభ్రాంతులకు గురిచేస్తూ స్వార్థ ప్రయోజనాలకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. అధికారులపై అనవసర ఒత్తిళ్లు తీసుకురావడం, బెదిరించడం, బలవంతంగా డబ్బులు డిమాండ్ చేయడం వంటి చర్యలను సహించరాదన్నారు.బెదిరింపులకు గురయ్యే అధికారులు, సిబ్బంది మౌనం వీడి వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఆధారాలతో ఫిర్యాదులు అందితే పోలీసులు సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.ప్రభుత్వ ఉద్యోగులు స్వేచ్ఛగా విధులు నిర్వహించే వాతావరణం కల్పించడం అందరి బాధ్యత అని అన్నారు. మహబూబాబాద్ జిల్లాలో బెదిరింపులు, అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న వారిపై అధికారులు దృష్టి సారించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధితులు భయపడకుండా ధైర్యంగా ఫిర్యాదు చేయాలని సూచించారు.

# భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం దాదాపు ఖరారు

### చట్టపరమైన ముసాయిదాపై ఇరు దేశాల పని.. అమెరికా రాయబారి ప్రకటన

**హైదరాబాద్ పల్స్, ఆగస్టు 23, సెంట్రల్ డెస్క్:** భారత్-అమెరికా మధ్య గత కొంతకాలంగా కొనసాగుతున్న వాణిజ్య ఒప్పందం దాదాపు ఖరారైనట్లు భారత్‌లో అమెరికా రాయబారి సెర్గియో గోర్ వెల్లడించారు. ప్రస్తుతం ఒప్పందం పూర్తికి అవసరమైన చట్టపరమైన ముసాయిదాపై ఇరు దేశాలు పనిచేస్తున్నట్లు తెలిపారు.ఎకనామిక్ టైమ్స్ వరల్డ్ లీడర్స్ సదస్సులో పాల్గొన్న సందర్భంగా ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. వాణిజ్య ఒప్పందానికి సంబంధించిన సూత్రప్రాయ అంగీకారం ఇప్పటికే కుదిరిందని, తుది రూపు ఇవ్వడానికి చట్టపరమైన, సాంకేతిక అంశాలను పరిశీలిస్తున్నట్లు పేర్కొన్నారు.ఈ ఒప్పందం ఖరారైతే భారత్-అమెరికా ద్వైపాక్షిక




వాణిజ్య సంబంధాలు మరింత బలోపేతం అవుతాయని విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ఇరు దేశాల భాగస్వామ్యం కీలకమని సెర్గియో గోర్ తెలిపారు.భారత్‌కు అమెరికా ఇస్తున్న ప్రాధాన్యతను ప్రస్తావిస్తూ, ఉన్నత స్థాయి పరస్పర సంబంధాలు కొనసాగుతున్నాయని చెప్పారు. అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో ఈ ఏడాది మే నెలలో భారత్‌లో పర్యటించగా, అక్టోబర్‌లో మరోసారి భారత పర్యటనకు వచ్చే అవకాశం ఉందని వెల్లడించారు.భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం అమలులోకి వస్తే ఇరు దేశాల మధ్య వాణిజ్యం, పెట్టుబడులు, ఆర్థిక సహకారం మరింత విస్తరించే అవకాశాలు ఉన్నాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# అజిత్ దోవల్ చైనా పర్యటన షురూ

### సరిహద్దు సమస్యపై కీలక చర్చలు.. వాంగ్ యితో 25వ విడత భేటీ



**న్యూఢిల్లీ, ఆగస్టు 23 (హైదరాబాద్ పల్స్ న్యూస్):** జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ ఆగస్టు 24న చైనాలో పర్యటించనున్నారు. బీజింగ్‌లో భారత్-చైనా ప్రత్యేక ప్రతినిధుల మధ్య జరిగే సమావేశంలో ఆయన పాల్గొననున్నారు. చైనా భద్రతా సలహాదారు వాంగ్ యితో 25వ విడత చర్చలు జరపనున్నారు.భారత్-చైనా మధ్య సుమారు 3,488 కిలోమీటర్ల సరిహద్దు ఉంది. 2003లో ప్రారంభమైన ప్రత్యేక ప్రతినిధుల చర్చలు సరిహద్దు వివాదాల పరిష్కారంతో పాటు ఇరు దేశాల మధ్య సంబంధాలకు సంబంధించిన పలు అంశాలపై కొనసాగుతున్నాయి. తాజా సమావేశంలో సరిహద్దు ప్రాంతాల్లో శాంతి, స్థిరత్వంతో పాటు ఇతర ద్వైపాక్షిక అంశాలపై చర్చించే అవకాశం ఉంది.సెప్టెంబర్ 12, 13 తేదీల్లో దిల్లీలో జరగనున్న బ్రిక్స్ సదస్సుకు చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ హాజరయ్యే అవకాశం ఉందన్న నేపథ్యంలో దోవల్ పర్యటనకు ప్రాధాన్యం ఏర్పడింది. అయితే జిన్‌పింగ్ భారత్ పర్యటనపై అధికారిక ధ్రువీకరణ ఇంకా వెలువడలేదు.సరిహద్దు ప్రాంతాల్లో శాంతియుత వాతావరణం కొనసాగడం అత్యవసరమని దోవల్ ఇటీవల స్పష్టం చేశారు. అరుణాచల్‌ప్రదేశ్‌పై చైనా చేస్తున్న వాదనలు, ఆ ప్రాంతంలోని కొన్ని ప్రదేశాలకు చైనా కొత్త పేర్లు పెట్టడం వంటి అంశాలు కూడా ఇరు దేశాల మధ్య చర్చల్లో ప్రాధాన్యం సంతరించుకునే అవకాశం ఉంది.

# ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, ఎంఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నూతన కమిటీలు

### రహీంఖాన్ పేట గ్రామ నూతన ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, ఎంఎస్ఎఫ్ నూతన కమిటీలు ఏర్పాటు

### నూతన కమిటీలను ఏర్పాటు చేసిన ఎమ్మార్పీఎస్ ఆలేరు నియోజకవర్గ ఇన్చార్జి నల్ల చంద్ర స్వామి

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 23, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గం ఆత్మకూరు(ఎం) మండలం రహీంఖాన్ పేట గ్రామంలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు మత దురంహకారం కుల వివక్షత సాఘీక అసమానతలు లేని సమ సమాజ నిర్మాణం కోసం జరిగే కర్తవ్య నిర్వహణకై జాతిని సమగ్ర అభివృద్ధి వైపు నడిపించే దిశగా క్షేత్రస్థాయిలో ఎమ్మార్పీఎస్ కమిటీల పునర్నిర్మాణం ఏర్పాటు చేయుటలో భాగంగాయాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గం ఆత్మకూరు(ఎం) మండలం రహీంఖాన్ పేట గ్రామం ఎమ్మార్పీఎస్ నూతన కమిటీ సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది.ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎమ్మార్పీఎస్ ఆలేరు నియోజకవర్గ ఇన్చార్జి నల్ల చంద్ర స్వామి మాదిగ హాజరై మాట్లాడుతూ... ఎస్సీ రిజర్వేషన్లు వర్గీకరణ సాధించిన అనంతరం ఎమ్మార్పీఎస్ జాతీయ స్థాయిలో మందకృష్ణ మాదిగ నాయకత్వంలో మాదిగల పేదరిక నిర్మూలన కోసం అదేవిధంగా సామాజిక, ఆర్థిక,రాజకీయ అసమానతలు లేని వ్యవస్థ కోసం భవిష్యత్తు పోరాటం కొనసాగుతుందని తెలిపారు ఈ పోరాటానికి మాదిగలు మరింత శక్తివంతంగా సిద్ధమవ్వాలని పిలుపునిచ్చారు..ఈ నెల 30 న ఆత్మకూరు(ఎం) మండల కేంద్రం లో ఎమ్మార్పియస్ మండల సదస్సు



జిల్లా ఇంచార్జీ బిర్రు మహేందర్ మాదిగ ముఖ్య అతిథిగా జరుగుతుందని సదస్సుకు గ్రామం నుండి తరలి రావాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశానికి విశిష్ట అతిథిగా ఆత్మకూరు(ఎం) మండల కో ఇంచార్జీ మందుల లింగ స్వామి మాదిగ హాజరు కావడం జరిగింది.సమావేశం అనంతరం ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, ఎంఎస్ఎఫ్ నూతన గ్రామ కమిటీలను ఎన్నుకోవడం జరిగింది.

నూతన ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీ వివరాలు...
అధ్యక్షుడు:- జిట్టా యాదగిరి మాదిగ
అధికార ప్రతినిధి:- యాతల రాంచరణ్ మాదిగ
ప్రధాన కార్యదర్శి :- గురుకు విజయ్ మాదిగ
ఉపాధ్యక్షులు :- పత్తెపురం వంశీ మాదిగ
కార్యదర్శి :- బూడిద విజయ్ మాదిగ
సహాయ కార్యదర్శి : పర్రెపాటి మధు మాదిగ
ప్రచార కార్యదర్శి : జిట్టా సాయి కుమార్ మాదిగ

నూతన ఎంఎస్పీ గ్రామ శాఖ కమిటీ వివరాలు
అధ్యక్షులు : బూడిద నర్సింహా మాదిగ
అధికార ప్రతినిధి :గంధమల్ల నర్సింహ్మా మాదిగ
ప్రధాన కార్యదర్శి : గంధమల్ల రాంచంద్రయ్య మాదిగ



కార్యదర్శి :బాకీ నర్సింహ్మా మాదిగ

నూతన ఎంఎస్ఎఫ్ గ్రామ శాఖ కమిటీ వివరాలు
అధ్యక్షులు : గంధమల్ల మత్స్యగిరి మాదిగ
అధికార ప్రతినిధి :బూడిద మనోజ్ మాదిగ
ప్రధాన కార్యదర్శి :గురుకు జస్వంత్ మాదిగ
కార్యదర్శి :పత్తెపురం అజయ్ మాదిగ
సహాయ కార్యదర్శి : పత్తెపురం లోకేష్ మాదిగ
ప్రచార కార్యదర్శి : పత్తెపురం ప్రేమ్ కుమార్ మాదిగ

మండల కమిటీకి గ్రామం నుండి బాధ్యులు స్వీకరించిన పత్తెపురం ఉప్పలయ్య మాదిగ
గురుకు యాదగిరి మాదిగ
బూడిద ఆంజనేయులు మాదిగ, గంధమల్ల బాస్కర్ మాదిగలు
ఎన్నికయ్యారు.



# వెస్లీ టీచర్స్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సమావేశం

### ముఖ్య అతిథిగా మాజీ కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్

**ఆగష్టు 23, ఓల్డ్ బోయిన్పల్లి (హైదరాబాద్ పల్స్ ప్రతినిధి):** ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ లోని వెస్లీ టీచర్స్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ముఖ్య అతిథిగా మాజీ కార్పొరేటర్ ముద్దం నర్సింహ యాదవ్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా కాలనీలో తిరుగుతూ అక్కడ నెలకొన్న తాగునీటి సమస్య, చెట్ల కొమ్మల తొలగింపు, స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు తదితర ప్రజా సమస్యలను స్వయంగా పరిశీలించారు. స్థానికులు తమ సమస్యలను ముద్దం నర్సింహ యాదవ్ దృష్టికి తీసుకువచ్చారు. సమస్యల పరిష్కారం కోసం ఆయన వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి, తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. స్థానికుల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. అనంతరం అసోసియేషన్ సభ్యులు ముద్దం నర్సింహ యాదవ్ ని శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు జి.వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు ఎన్. పరమేష్ గౌడ్, ప్రధాన కార్యదర్శి సీహెచ్. తిరుపతి, జాయింట్ సెక్రటరీ బి. శ్రీనివాసరావు, కోశాధికారి జి. శ్రీనివాస్, సహాయ కోశాధికారి ఆర్.ఆర్. ఉదయ్ కుమార్, సలహాదారులు ఎస్. కృష్ణయ్య, ఎం. నారాయణరావు, పి. చంద్రశేఖర్, వై. విక్రమ్ సింగ్ పాల్గొన్నారు.

# మూడు దేశాల పర్యటనకు ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్

### అమెరికా, కెనడా, బ్రిటన్‌లో ప్రవాస భారతీయులతో సమావేశాలు

**హైదరాబాద్ పల్స్, ఆగస్టు 23, న్యూఢిల్లీ:** ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల నేపథ్యంలో సర్‌సంఘచాలక్ మోహన్ భాగవత్ ఆగస్టు 25 నుంచి అమెరికా, కెనడా, బ్రిటన్ దేశాల్లో పర్యటించనున్నారు. ప్రవాస భారతీయ సంఘాలు, స్థానిక సంస్థల ఆహ్వానం మేరకు ఈ పర్యటన చేపడుతున్నట్లు ఆర్ఎస్ఎస్ వెల్లడించింది.పర్యటనలో భాగంగా మూడు దేశాల్లో భారతీయ సమాజం, హిందూ సమాజం, స్థానిక సంస్థల ప్రతినిధులతో భాగవత్ సమావేశాలు నిర్వహించనున్నారు. భారతదేశం, హిందూ సమాజం, ఆర్ఎస్ఎస్‌పై ఉన్న అపోహలను తొలగించడం, వాస్తవిక సమాచారాన్ని అందించడం పర్యటన ప్రధాన లక్ష్యాల్లో ఉన్నట్లు ఆర్ఎస్ఎస్ సహ సర్‌కార్యవాహ్ సీఆర్ ముకుంద తెలిపారు.

**న్యూయార్క్‌లో ప్రత్యేక కార్యక్రమం**

అమెరికా పర్యటనలో భాగంగా ఆగస్టు 29న న్యూయార్క్‌లో జరిగే 'యూనివర్సల్ వన్‌నెస్' కార్యక్రమంలో మోహన్ భాగవత్ పాల్గొని ప్రసంగించనున్నారు. రక్షాబంధన్ సందర్భంగా నిర్వహించే ఈ కార్యక్రమంలో సామాజిక ఐక్యత, పరస్పర అవగాహన, ప్రపంచ సామరస్యంపై చర్చ జరగనుంది.

**టొరంటో, లండన్‌లోనూ కార్యక్రమాలు**

కెనడాలోని టొరంటో, బ్రిటన్‌లోని లండన్‌లో సామాజిక నాయకత్వ కార్యక్రమాల్లో భాగవత్ పాల్గొంటారని ఆర్ఎస్ఎస్ వర్గాలు వెల్లడించాయి. హిందువులు, భారతీయ మూలాలున్న ప్రజల ప్రయోజనాలు, హక్కులపై స్థానిక సమాజాలతో




సంభాషణ పెంచడం కూడా పర్యటనలో భాగంగా ఉంటుందని తెలిపాయి.ఆర్ఎస్ఎస్ శతాబ్ది సంవత్సరంలో చేపడుతున్న అంతర్జాతీయ విస్తరణ కార్యక్రమాల్లో భాగంగానే ఈ మూడు దేశాల పర్యటన జరుగుతోంది.